**విలేకరులు కావలెను**

**పెన్ సత్తా తెలుగు దినపత్రిక**

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లాల నుండి పెన్ సత్తా దినపత్రికలో పని చేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజక వర్గ ఇన్‌ఛార్జులు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

**సెల్ : 98853 15779**

RNI No.APTEL/2023/87729

ప్రశ్నించడం అందరి హక్కు...

# పెన్ సత్తా

PEN SATTA Telugu Daily



అనకాపల్లి సంపుటి : 3 సంచిక : 335 | 10 - 5 - 2025 శనివారం | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | పేజీలు : 8 | వెల : 3.00

# పాకిస్థాన్ దాడులను తిప్పి కొట్టాం : ఆర్మీ వెల్లడి


## - ఆపరేషన్ సింధూర్ లేటెస్ట్ అప్డేట్స్ ఇచ్చిన భారత ప్రభుత్వం



**న్యూఢిల్లీ :** భారత్‌పై పాకిస్థాన్ డ్రోన్ దాడుల సందర్భంగా ప్రభుత్వ వివరాలు పత్రికా సమావేశంలో ప్రకటించింది. ఈ ప్రెస్ మీట్‌లో ఎయిర్‌ఫోర్స్ వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్, ఇండియన్ ఆర్మీకి చెందిన కల్నల్ సోఫియా ఖురేషి, విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి పాల్గొని వివరాలు వెల్లడించారు. ఆపరేషన్ సింధూర్‌కు సంబంధించి భారత ప్రభుత్వం దిల్లీలో అప్డేట్స్ ఇచ్చింది. విదేశాంగ శాఖ నేతృత్వంలో నిర్వహించిన ఈ ప్రెస్ మీట్‌లో ఎయిర్ ఫోర్స్ వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్, ఇండియన్ ఆర్మీకి చెందిన కల్నల్ సోఫియా ఖురేషి, విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి పాల్గొని వివరాలు వెల్లడించారు. కల్నల్ సోఫియా ఖురేషి అందించిన వివరాల ప్రకారం భారత సరిహద్దుల్లో పాక్ ఉల్లంఘనలకు పాల్పడుతోంది. పాక్ దాడులను డ్రోన్లతో తిప్పికొట్టాం. పశ్చిమ సరిహద్దు ప్రాంతంలో పాక్ దాడులకు పాల్పడింది. లేహ్ నుంచి సర్‌క్రీక్ వరకు 36 చోట్ల దాడులు చేసింది. కైనటిక్, నాన్ కైనటిక్ సాధనాలతో భారత్ పాక్ దాడుల్ని తిప్పికొట్టింది. పాక్ డ్రోన్లన్నీ టర్కీకి చెందినవి గుర్తించాం. బఠిండా సైనిక స్థావరంపై దాడికి యత్నించారు. అయితే పాక్ దాడులను సమర్థంగా తిప్పికొట్టాం అని కల్నల్ సోఫియా ఖురేషి వెల్లడించారు. భారత మిలిటరీ బేస్‌లు టార్గెట్‌గా పాక్ దాడులు జరిగాయని సోఫియా ఖురేషి తెలిపారు. ఉత్తర ప్రాంతం లోని 26 ప్రదేశాలు టార్గెట్‌గా పాక్ దాడులు చేసిందని, పాక్ డ్రోన్లను భారత బలగాలు కూల్చివేశాయని వెల్లడించారు. ఇక, ఎయిర్‌ఫోర్స్ వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ చెప్పిన వివరాల ప్రకారం భారత్ దాడిలో పాక్ కు తీవ్ర నష్టం కలిగింది. పౌర విమానాలను కవచంగా చేసుకుని పాక్ దాడి చేసింది. కరాచీ–లాహోర్ మధ్య విమానాలు తిరుగుతున్నాయి. మన వాయుసేన ఎంతో సంయమనం పాటిస్తోంది. ఎయిర్ స్పేస్ మూసివేసినట్లు పాక్ తప్పుడు ప్రచారం చేస్తోంది. అని వ్యోమికా సింగ్ తెలిపారు. ఇక, విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి ఇచ్చిన వివరాల ప్రకారం గత రాత్రి పాకిస్థాన్ రెచ్చగొట్టే చర్యలకు దిగింది. పాక్ దాడులను సమర్థంగా తిప్పి కొట్టాం. పలు భారత నగరాలు లక్ష్యంగా పాక్ దాడులు చేసింది. నిన్నటి దాడుల్లో పాకిస్థాన్‌కే ఎక్కువ నష్టం జరిగింది. చాలా సార్లు పాక్ సీస్ ఫైర్ ఉల్లంఘనలకు పాల్పడింది. ప్రపంచాన్ని మోసం చేసేందుకు పాక్ ప్రయత్నం. మతం రంగు పూసేందుకు పాక్ యత్నిస్తోంది. ప్రార్థనా మందిరాల పై దాడులు చేయలేదని పాక్ చెప్పడం అబద్ధం. భారత్‌పై పాకిస్థాన్ తప్పుడు ప్రచారం చేస్తోంది. పూంఛ్‌లోని స్కూల్‌పై పాక్ దాడి చేసింది. దాడి సమయంలో స్కూల్ మూసివేసి ఉంది. మత సామరస్యాన్ని దెబ్బతీసేందుకు పాక్ కుట్ర చేస్తోంది. కర్తార్‌పూర్ కారిడార్ మూసివేశాం. పాక్ దాడులను సమర్థంగా ఎదుర్కొన్నాం. పాక్ చర్యలపై మరో సారి ఐఎంఎఫ్‌కు ఫిర్యాదు చేస్తాం. పాక్ ఎయిర్ స్పేస్‌ను మూసివేయలేదు. సింధు జలాల ఒప్పందం రద్దు చేశాం అని విక్రమ్ మిస్రి తెలిపారు.

# మురళీ నాయక్ ఫ్యామిలీకి సీఎం పరామర్శ

## - మురళీ కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు



**అమరావతి, మే 9 (పెన్ సత్తా):** భారత్ – పాకిస్థాన్ యుద్ధ భూమిలో వీరమరణం పొందిన తెలుగు జవాన్ మురళీ నాయక్ కుటుంబాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫోన్‌లో పరామర్శించారు. దేశ రక్షణలో పెనుకొండ నియోజకవర్గం గోరంట్ల మండలం కల్లితండాకు చెందిన మురళీ నాయక్ ప్రాణాలు కోల్పోవడంపై ముఖ్యమంత్రి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మురళీ నాయక్ తల్లిదండ్రులు జ్యోతిబాయి, శ్రీరాం నాయక్‌లతో ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. మాతృభూమి కోసం ప్రాణాలు అర్పించిన మురళీ త్యాగాన్ని దేశమంతా గుర్తు పెట్టుకుంటుందన్నారు. 25 ఏళ్ల వయసులోనే దేశం కోసం అమరుడైన మురళీ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. వీరజవాన్ మురళి తల్లిదండ్రుల ఆవేదన తీర్చలేనిదని వారు ధైర్యంగా ఉండాలని కోరుతున్నానని సీఎం చంద్రబాబు అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో వీర మరణం పొందిన జవాన్ మురళీ నాయక్ త్యాగాన్ని భారత జాతి ఎన్నడూ మరచిపోదని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. జమ్ము కశ్మీర్ సరిహద్దుల్లో శత్రుమూకలతో పోరాడి మరణించిన మురళీ నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని తెలిపారు. మురళీ నాయక్ వీరమరణంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పందించారు. శ్రీ సత్యసాయి జిల్లా కల్లి తండాకు చెందిన ఈ యువ జవాన్ దేశ రక్షణకు అంకితమై, సమర భూమిలో అమరులయ్యారన్నారు. ఈ వీరుడి తల్లితండ్రులు జ్యోతి బాయి, శ్రీరామ్ నాయక్, ఇతర కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆ కుటుంబానికి భరోసా ఇస్తుందని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. మరో వైపు వీరమరణం పొందిన మురళీ నాయక్ కుటుంబ సభ్యులను మంత్రి సవిత పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. జై జవాన్, జోహార్ మురళి నాయక్ అంటూ నినాదాలు చేశారు. వీర జవాన్ మురళీ నాయక్ చిత్రపటానికి మంత్రి సవిత నివాళులర్పించారు.

# యుద్ధ భూమిలో రాష్ట్ర జవాను వీరమరణం

**పెనుకొండ, మే 9 (పెన్ సత్తా):** శ్రీ సత్య సాయి జిల్లా, పెనుకొండ నియోజకవర్గం గోరంట్ల మండలం కళ్ళితాండా కు చెందిన ఆర్మీ జవాన్ మురళీ నాయక్ పాక్‌పై యుద్ధంలో వీరమరణం పొందారు. జమ్మూ కాశ్మీర్‌లో పాకిస్థాన్ జరిపిన కాల్పుల్లో తెలుగు జవాన్ మురళీ నాయక్ మృతి చెందారు. శనివారం స్వగ్రామానికి వీర జవాన్ పార్థివ దేహం రానున్నట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. పాకిస్థాన్ భారత సరిహద్దు ప్రాంతాలపై క్షిపణి, డ్రోన్ దాడులకు పాల్పడుతోంది. ఈ క్రమంలో జమ్మూ కాశ్మీర్‌లో పాకిస్థాన్ జరిపిన కాల్పుల్లో తెలుగు జవాన్ వీర మరణం పొందారు. మృతి చెందిన జవాన్‌ను మురళీ నాయక్‌గా గుర్తించారు. వీర జవాన్‌ది ఏపీలోని సత్యసాయి జిల్లా గోరంట్ల మండల పరిధిలోని కల్లి తండా. గురువారం రాత్రి సరిహద్దు వెంబడి పాక్ కాల్పులు జరపగా మన సైన్యం కూడా ధీటుగానే బదులిచ్చింది. ఈ ఎదురు కాల్పుల్లో మురళీ నాయక్ చనిపోయినట్లు సమాచారం. రేపు స్వగ్రామానికి వీర జవాన్ పార్థివ దేహం రానున్నట్లు తెలుస్తోంది. వీర జవాన్ మురళీ నాయక్ సోమందేపల్లి మండలం నాగినాయని చెరువుతండాలో పెరిగారు. సోమందేపల్లిలోని విజ్ఞాన్ స్కూల్‌లో చదివారు. జవాన్ మృతితో ఆయన కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. స్వగ్రామం కల్లితండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



# సింధు జలాల ఒప్పందంపై మాది సహాయక పాత్ర మాత్రమే

**న్యూఢిల్లీ :** పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేస్తూ భారత్ ఇటీవల కఠిన నిర్ణయం తీసుకుంది. దీనిపై ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగా తొలిసారి స్పందించారు. ఈ ఒప్పందంపై వరల్డ్ బ్యాంక్ జోక్యం చేసుకుంటుందంటూ వస్తున్న ఊహాగానాలను ఆయన కొట్టివేశారు. వరల్డ్ బ్యాంక్ పాత్ర కేవలం ఒక సహాయకుడిగానే ఉంటుందని తెలిపారు. ఇందులో ఒక సహాయకుడి పాత్రకు మించి వరల్డ్ బ్యాంకు పాత్ర ఏమీ ఉండదు. వరల్డ్ బ్యాంకు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరిస్తుందనే ఊహాగానాలన్నీ అర్థం లేనివే. మా పాత్ర కేవలం సహాయకుడి పాత్రకే పరిమితం అని అజయ్ బంగా చెప్పారు. ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోదీని న్యూఢిల్లీలో గురువారం నాడు కలుసుకున్నారు. దీంతో సింధు జలాల ఒప్పందం రద్దు అంశం పై ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వం చేసే అవకాశాల పై ఊహాగానాలు వెలువడ్డాయి. పహల్గాంలో 26 మంది టూరిస్టులను ఉగ్రవాదులు ఊచకోత కోసిన మరుసటి రోజే సింధూ జలాల ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్టు భారత్ ప్రకటించింది. దీనిపై పాక్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. నీళ్లివ్వకుంటే రక్తపాతం జరుగుతుంది అంటూ తీవ్ర ప్రకటనలకు పాక్ నేతలు దిగారు. ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంలో 1960 సెప్టెంబర్‌లో సింధు నది, దాని ఉపనదుల జలాల పంపకంపై భారత్–పాక్ మధ్య ఒప్పందం జరిగింది. అప్పటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, పాక్ ప్రధాని అయూబ్ ఖాన్ దానిపై సంతకాలు చేశారు. కాగా, సింధు జలాల పంపిణీ ఒప్పందం నిబంధనలపై పునః సమీక్ష జరపాలని భారత్ చాలాకాలంగా డిమాండ్ చేస్తోంది. తాగు, సాగునీటి అవసరాల్లో అప్పటికీ ఇప్పటికీ తేడాలొచ్చాయని భారత్ స్పష్టం చేసింది.అయితే పాక్ దీనిని వ్యతిరేకిస్తూ వచ్చింది. ఈ క్రమంలో పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ ఈ ఒప్పందం అమలును నిలిపివేస్తూ నిర్ణయం తీసుకుంది.



# పాక్ పై దాడి చేసింది మేడ్ ఇన్ ఇండియా డ్రోన్లే



**న్యూఢిల్లీ :** పాక్‌లో ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయడానికి చేపట్టిన ఆపరేషన్ సిందూర్ కోసం భారత సైన్యం అత్యాధునిక ఆయుధాలను ఉపయోగించింది. వీటిలో స్కాల్ప్ క్రూయిజ్ క్షిపణులు, హ్యామర్ బాంబులతో పాటు స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఆత్మాహుతి డ్రోన్లు కూడా ఉన్నాయి. ఇజ్రాయెల్ కు చెందిన ఎల్బిట్ సిస్టమ్స్ సహకారంతో బెంగళూరుకు చెందిన అల్ఫా డిజైన్ టెక్నాలజీస్ లిమిటెడ్ (ఏడీటీఎల్) అభివృద్ధి చేసిన స్కై-స్ట్రైకర్ సూసైడ్ డ్రోన్లు ఈ ఆపరేషన్ సందర్భంగా అరంగేట్రం చేశాయి. శత్రు శిబిరాలను అత్యంత కచ్చితత్వంతో గుర్తించి విరుచుకుపడేందుకు వీలుగా వీటిని రూపొందించారు. ఈ లాయిటరింగ్ మ్యూనిషన్లు 5 కిలోల వార్ హెడ్‌ను మోసుకెళ్లగలవు. సుదూర లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం ఉన్న ఈ డ్రోన్లు 100 కిలో మీటర్ల పరిధిలో ఆకాశంలో తిరుగుతూ, లక్ష్యాన్ని నేరుగా ఢీ కొట్టి విధ్వంసం సృష్టిస్తాయి. కామికేజ్ డ్రోన్లుగా పిలిచే ఈ ఆత్మహుతి డ్రోన్ల తయారీ ఖర్చు కూడా చాలా తక్కువే. ఇటువంటి 100 యూఏవీల కొనుగోలు కోసం 2021లో ఒప్పందం చేసుకొని భారత సైన్యంలో ప్రవేశపెట్టారు. రెండు రోజుల క్రితం వాటిని పాక్‌లోని 15 లక్ష్యాలపై సంధించారు, అన్ని లక్ష్యాలను విజయవంతంగా చేదించాయి. ఉగ్రవాద స్థావరాలు ఈ మానవ రహిత డ్రోన్‌లు ధ్వంసం చేశాయి. వాటి ధాటికి 100 మందికి పైగా ఉగ్రవాదులు గాయపడగా, తొమ్మిది ఉగ్ర స్థావరాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ డ్రోన్ల వివరాలను ఆర్మీ వర్గాలు వెల్లడించాయి.

# ఎమర్జెన్సీ పవర్స్ వాడేయండి రాష్ట్రాలకు కేంద్రం ఆదేశం



**న్యూఢిల్లీ :** పహల్గాం ఉగ్రదాడికి కౌంటర్‌గా భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతంగా కొనసాగుతోంది. ఈ క్రమంలో పాకిస్తాన్ భారత సరిహద్దుల్లోని రాష్ట్రాల పై డ్రోన్లు, మోర్టార్లతో కవ్వింపు చర్యలకు దిగుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం కీలక ఆదేశాలు ఇచ్చింది. యుద్ధ పరిస్థితుల్లో వాడే అత్యవసర అధికారాలను వాడాలని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రం కోరింది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు హోంశాఖ ఈ మేరకు అత్యవసర ఆదేశాలు జారీ చేసింది. 1968 నాటి పౌర రక్షణ నిబంధనల ప్రకారం అత్యవసర అధికారాలను ఉపయోగించాలని కేంద్రం రాష్ట్రాలను కోరింది. ముఖ్యంగా దాడులు లేదా అంతరాయాల ముప్పు ఉన్న సందర్భాలలో ఈ ఆదేశంతో అధికారులు వేగంగా నిర్ణయాలు తీసుకోవడానికి, అత్యవసర కొనుగోళ్లు చేయడానికి వీలవుతుంది. 1968 నాటి పౌర రక్షణ నియమాలలోని సెక్షన్ 11ని అమలు చేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని ప్రధాన కార్యదర్శులు, లెఫ్టినెంట్ గవర్నర్లకు కేంద్ర హోంశాఖ ఇవాళ లేఖ రాసింది. ఈ అధికారాల వల్ల ప్రజలను, ఆస్తులను రక్షించడానికి అవసరమైన ఏవైనా అత్యవసర చర్యలు తీసుకోవచ్చు. అలాగే ఏదైనా అత్యవసర పరిస్థితిలో విద్యుత్, నీరు, ఆసుపత్రులు, కమ్యూనికేషన్ వంటి ముఖ్యమైన సేవలు సజావుగా కొనసాగేలా ఏ చర్య అయినా తీసుకోవచ్చు. అలాగే కేంద్రం నుంచి అనుమతుల కోసం వేచి ఉండకుండా సాధారణ ప్రక్రియను పక్కనబెట్టి పౌర రక్షణకు అవసరమైన పరికరాలు లేదా సేవలను నేరుగా కొనుగోలు చేసేందుకు వీలు కల్పిస్తోంది. సైనిక దాడి అయినా, ఉగ్రవాద దాడి అయినా లేదా సాధారణ జీవితానికి అంతరాయం కలిగించే ఏ చర్య అయినా రాష్ట్రాలు వేగంగా చర్య తీసుకోవడానికి సిద్ధంగా ఉండాలని కేంద్రం ఆదేశాలు ఇచ్చింది.

# సంపాదకీయం

## ఏ వెలుగులకీ లెక్కలు

కొన్ని నిర్ణయాలను.. తాత్కాలిక ఆవేశంతోనో, స్పందనతోనో, చిరకాల కోరిక నెరవేరుతుందన్న ఆశావహ దృష్టితోనో చూస్తే చరిత్రాత్మకం అనిపిస్తాయి. సమకాలీన చరిత్రను కొత్త మలుపు తిప్పే శక్తి వాటికి ఉన్నదని భావించేలా మనపై ప్రగాఢ ముద్ర వేస్తాయి. 14 ఏళ్ల కిందట సామాజిక, ఆర్థిక కులగణనను (ఎస్ఈసీసీ) చేపడ తామని ఆనాటి యూపీయే ప్రభుత్వం ప్రకటించినప్పుడు అన్నిరంగాల్లో సామాజిక న్యాయం, రిజర్వేషన్ల పరిధి బాగా విస్తరించాలని కోరుకుంటున్న వారందరూ అలాగే భావించారు. కులగణన అనేది కులనిర్మూలనకు దారి తీస్తుందని ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త సతీశ్ దేశ్‌పాండే ఘనంగా ప్రకటించారు. మరో ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త గేల్ ఆమ్‌వెట్ సమానత్వానికి అవసరమైన విధానాల రూపకల్పనకు కులగణన ఎంత అవసరమో వివరించారు. దాన్ని వ్యతిరేకించే వారందరూ కళ్లముందున్న సామాజిక అసమానతలను పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కులగణన అనేది సంక్లిష్టమైనది కానేకాదనీ, ప్రతివ్యక్తి దగ్గరికి వెళ్లి నీ కులం ఏమిటి? అని అడిగి దాన్ని నమోదు చేస్తే సరిపోతుందనీ ఆమ్‌వెట్ సూచించారు. అట్లా సేకరించిన సమాచారాన్ని ఇతరత్రా వాటిని ఆధారం చేసుకుని నిపుణులు నింపాదిగా విశ్లేషణ చేసి వివిధ కులాల ప్రజలు సామాజికంగా, ఆర్థికంగా ఏ వర్గానికి చెందుతారో నిర్ణయించవచ్చని చెప్పారు. ప్రజలు స్వచ్ఛందంగా చెప్పే కులాల పేర్లను జనాభా సేకర్తలు యథాతథంగా రాసుకోవాలనీ, ముందుగా నిర్దేశించుకున్న కొన్ని కేటగిరీల్లో చేర్చేలా ఫలానా విధంగా సమాచారం చెప్పాల్సిందిగా నిర్బంధం పెట్టకూడదని కూడా సూచించారు. ఎన్నో తర్జనభర్జనల అనంతరం ఆనాడు సామాజిక, ఆర్థిక, కులగణను ఆమ్‌వెట్ లాంటి వాళ్లు సూచించిన పద్ధతిలోనే చేపట్టారు. 6.4 లక్షల 'టాబ్స్'తో 640 జిల్లాల్లో డిజిటల్‌గా సమాచారాన్ని సేకరించారు. జనాభా సేకరణ చట్టం పరిధిలో కాకుండా ఆ కులగణనను వేరుగా నిర్వహించారు. అందుకే జనాభా లెక్కలతో పాటు ఆ సమాచారాన్ని వెల్లడించలేదు. విడిగా కూడా కులాల సమాచారాన్ని బహిరంగపరచలేదు. అంతలోనే ఎన్నికలు వచ్చాయి. యూపీయే ప్రభుత్వం ఓడిపోయింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం 2015లో పాక్షికంగా కొంత సమాచారాన్ని వెల్లడించింది. అది కూడా గ్రామీణ ప్రాంతాలకు సంబంధించిన ఆర్థిక సమాచారాన్ని మాత్రమే ప్రకటించింది. గ్రామీణ ప్రాంతాల్లోని 17.91 కోట్ల కుటుంబాల్లో 7.05 కోట్ల కుటుంబాలు ప్రభుత్వ చేయూత అవసరం లేనివిగా గుర్తించారు. 16 అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆ నిర్ణయానికి వచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక పరిస్థితులపై 2011కు ముందు కూడా అవసరమైన సమాచారం ఉంది. కానీ దేశవ్యాప్తంగా ఆర్థిక పరిస్థితులను ఏకకాలంలో సర్వేచేయటంతో అంతకుముందు లేనంత స్థాయిలో సమగ్రంగానే సమాచారం లభ్యమైంది. కులగణన కోసం పట్టుపట్టిన వాళ్లకు ఆ సమాచారం సంతృప్తిని ఇవ్వలేదు. వెనుకబడిన కులాల జనాభా ఎంత ఉందో స్పష్టంగా వెల్లడి కావాలనీ దాంతో పాటు వారి విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక పరిస్థితి గురించి స్పష్టమైన గణాంకాలు ఉండాలనీ వారు కోరుకున్నారు. ప్రభుత్వం 2018లో వెల్లడించిన తుది నివేదికలో కూడా కులాల సమాచారాన్ని పొందుపర్చలేదు. రిజర్వేషన్ల కోసం మరాఠాలు చేస్తున్న ఆందోళనలతో సతమతమవుతున్న మహారాష్ట్ర ప్రభుత్వం కేంద్రం తన వద్దనున్న కులాలవారీ గణాంకాలను ఇవ్వాలని కోరింది. కేంద్రం తిరస్కరించింది. దీంతో సుప్రీంకోర్టులో మహారాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ దాఖలుచేసింది. తన దగ్గరున్న కులాల సమాచారం చాలా గందరగోళంగా ఉందనీ, దానికి ప్రామాణికత లేదనీ కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. మహారాష్ట్రలో కులాలు 4,28,677గా తేలాయనీ, ఇక దేశవ్యాప్తంగా అవి 45 లక్షల దాకా నమోదయ్యాయని పేర్కొంది. గందరగోళాన్ని సృష్టించే అటువంటి సమాచారాన్ని వెల్లడి చేయలేమని తేల్చిచెప్పింది.అప్పటికి మహారాష్ట్రలో ఎస్సీ, ఎస్టీ, బీసీల జాబితాలో 494 కులాలు మాత్రమే ఉన్నాయి. ప్రతి రాష్ట్రంలోనూ ఈ తరహా జాబితాలు ఉన్నాయి. వాటిని ప్రాతిపదికగా తీసుకుని కులాల జనసంఖ్య లెక్కించినా కొంత ఫలితం ఉండేది. ఎవరికి వారు తమది ఫలానా కులమని చెబితే మారుమాట్లాడకుండా దాన్ని నమోదు చేయాలనే నిర్ణయం మొదటికే మోసం తెచ్చింది. ఈ పరిస్థితిని అధికార యంత్రాంగం ఎందుకు ఊహించలేకపోయిందన్నది ఇప్పటికీ జవాబు లేని ప్రశ్నగానే మిగిలిపోయింది. రాష్ట్రాలవారీగా కులాలపై ఎన్నో అధ్యయనాలు అప్పటికే వెలువడిన నేపథ్యంలో ఇదెందుకు జరిగిందన్న విషయాన్ని కూడా ఎవరూ గట్టిగా లేవనెత్తలేదు. అప్పటి సర్వేని వేనోళ్ల పొగిడిన చాలామంది ఆ వైపరీత్యంపై మౌనం పాటించారు. కులాల లెక్కల విషయంలో ఆ గతం పునరావృతం కాకుండా ఏం చేయబోతున్నారన్న దానిపై ఇప్పటికైతే స్పష్టత లేదు. జనాభా సేకరణ చట్టాన్ని సవరించి కులాల లెక్కలను సాధికారికంగా తేల్చుతామని కేంద్రమంత్రుల నుంచి ప్రకటనలు మాత్రం వెలువడుతున్నాయి. ఆ లెక్కలు రాజకీయాల్లో పావులుగా మారకుండా చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు. కేంద్ర మంత్రివర్గం తీసుకున్న కులగణన నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ తన ఘనతగానే భావిస్తోంది. రాహుల్ గాంధీ చేసిన పోరాటంతోనే కేంద్రం దిగివచ్చిందనే ప్రచారాన్ని ముమ్మరం చేసింది. దాంతోనే ఆగలేదు. తెలంగాణలో తమ పార్టీ ప్రభుత్వం చేసిన కులసర్వే సర్వసమగ్రమైందనీ దాన్ని దేశవ్యాప్తంగా అనుసరిస్తే అద్భుత ఫలితాలు వస్తాయని చెబుతోంది. తెలంగాణ కులసర్వేలో వెల్లడైన విద్య, ఉద్యోగ, ఆర్థిక పరిస్థితులకు సంబంధించి కీలక సమాచారాన్ని బయటపెట్టకుండా అద్భుత ఫలితాల గురించి పదేపదే మాట్లాడటం అసంబద్ధంగా అనిపిస్తుంది. ఆ సమాచారం ఏమిటో తెలిస్తేనే దేశవ్యాప్తంగా అనుసరించతగ్గ నమూనాగా తెలంగాణ సర్వే పనికొస్తుందో లేదో చెప్పగలిగే అవకాశం ఉంటుంది. ఈసారి చేపట్టబోయే జనాభా లెక్కల్లో కులాన్ని ఒక అంశంగా చేర్చినంత మాత్రాన అద్భుతాలు జరుగుతాయని చెప్పలేం. ప్రతి కులానికి సంబంధించి సమగ్ర సమాచారం సేకరించటమే లక్ష్యమైతే జనాభా సేకరణలో చాలా మార్పులను చేపట్టాల్సి వస్తుంది. ఆస్తులు, ఆదాయాలు, ఉద్యోగాలు, వ్యాపారాలు, హోదాల సమాచారాన్ని కచ్చితంగా సేకరించాలి. అట్లాంటి సమాచారాన్ని సాధారణ జనాభా లెక్కలతో పాటు సేకరించిన సందర్భం ఇప్పటివరకూ లేదు. 2011లో చేసిన కసరత్తు ఆశించిన ఫలితాన్నీ ఇవ్వలేదు. పోనీ సాధారణ జనాభాలెక్కల్లో భాగంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సంబంధించి సేకరిస్తోన్న సమాచారం మాదిరిగానే ఇతరకులాల విషయంలో జరిపితే లక్ష్యం నెరవేరుతుందని చెప్పలేం. ఉదాహరణకు 2011 నాటి జనాభా లెక్కల్లో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి ప్రతి కులం, తెగ విషయంలో సంఖ్యాపరమైన సమాచారం ఉంది. కానీ కులాల వారీగా ఆర్థిక, విద్యా, ఉద్యోగపరమైన సమాచారం లేదు. ఎస్సీల్లో డిగ్రీ ఎంతమంది చదివారో తెలుస్తుంది. ఎంతమంది నిరక్షరాస్యులు ఉన్నారో వెల్లడవుతుంది. ఎంతమంది భూమిలేని వారున్నారో కనుక్కోవచ్చు. ఎంతమంది ఏ వృత్తుల్లో ఉన్నారో కూడా అంచనాకట్టొచ్చు. కానీ ఏ కులం వాళ్లు నిర్దిష్టంగా ఎక్కడున్నారో తెలుసుకోలేం. ఎవరికి ఉద్యోగాలు ఎక్కువ ఉన్నాయో, ఎవరికి తక్కువ ఉన్నాయో తెలుసుకోలేం. స్థూలచిత్రమే తప్ప విడి కులం పరిస్థితి కనపడదు. జనాభా లెక్కల్లో అటువంటి నిర్దిష్ట కుల సంబంధిత సమాచారమే ఉండి ఉంటే ఎస్సీ వర్గీకరణ సమస్య అంత జటిలమయ్యేది కాదు. కళ్లముందు కనపడే వాస్తవాలతో ఎవరు ఎక్కడ ఉన్నారో తెలిసిపోయేది. వర్గీకరణ వివాదం ఎప్పుడో ముగిసేలా రాజకీయ ఒత్తిళ్లు వచ్చి ఉండేవి. న్యాయస్థానాలూ వాస్తవాలను తొందరగా పరిగణనలోకి తీసుకుని ఉండేవి! పరిస్థితి ఇలా ఉన్న నేపథ్యంలో ఇతర కులాలకు సంబంధించి కూడా ఆ తరహా సమాచారాన్నే సేకరిస్తే అది పరిమితంగానే ఉంటుంది. దాన్ని సైతం చేపట్టకుండా కేవలం కులాలవారీ జనాభాను మాత్రమే లెక్కిస్తే అది మరింత పరిమితమైన ప్రయోజనాన్నే ఇస్తుంది.

# పారిపోతున్న పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ మునీర్ అరెస్ట్





**పాకిస్థాన్ :** భారత్ దెబ్బకు పాకిస్థాన్ అతలాకుతలం అవుతోంది. పాకిస్థాన్‌లోని లాహౌర్, రాజధాని ఇస్లామాబాద్‌లో దాడులు నిర్వహించింది భారత ఆర్మీ. పాకిస్థాన్ ప్రధాని షరీఫ్ దేశం విడిచి బ్రహెయిన్ పారిపోయే పరిస్థితి నెలకొంది. అటు బలూచిస్థాన్ కూడా పాకిస్థాన్‌పై దాడులకు పాల్పడుతోంది. ఈ క్రమంలో పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ అరెస్ట్ అయినట్లు సామాజిక మాధ్యమాల్లో వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. మరోవైపు పాకిస్థాన్ ప్రధాని, ఇతర ఆర్మీ అధికారులతో కలిసి బ్రహెయిన్ పారిపోతున్నట్లు సమాచారం అందుతోంది. ఇక పాకిస్థాన్‌లో రాష్ట్రపతి పాలన దిశగా అడుగులు పడుతున్నట్లు తెలుస్తోంది. మరో వైపు భారత నేవీ పాకిస్థాన్‌ను వణికిస్తోంది. రంగంలోకి 26 యుద్ధ నౌకలు దిగాయి. ఇప్పటికే కరాచీ పోర్టుపై ఐఎన్ఎస్ విక్రాంత్ దాడి చేసింది. 1971 తర్వాత కరాచీపై భారత నేవీ దాడులు జరగడం ఇదే తొలిసారి. భారత్ దాడికి కరాచీలో 10 పోర్టులు ధ్వంసం అయినట్లు సమాచారం. ఆపరేషన్ సింధూర్ లో భాగంగా భారత్, పాకిస్థాన్‌లోని లాహౌర్, సియోల్ కోట్, పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ నగరాలపై అటాక్ ప్రారంభించింది. అక్కడి పాకిస్థాన్ క్షిపణులు, డ్రోన్లను ధ్వంసం చేస్తోంది. మరోవైపు పాకిస్థాన్ జమ్మూపై హమాస్ తరహా డ్రోన్ దాడులకు పాల్పడుతోంది. అయితే భారత వాయు సేన పాక్ ప్రయోగించిన దాదాపు 8 క్షిపణులు, డ్రోన్‌లను కూల్చేసింది. ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా భారత్, పాకిస్థాన్‌లోని లాహౌర్, సియోల్ కోట్, పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ నగరాలపై అటాక్ ప్రారంభించింది. అక్కడి పాకిస్థాన్ క్షిపణులు, డ్రోన్లను ధ్వంసం చేస్తోంది. మరో వైపు పాకిస్థాన్ జమ్మూపై హమాస్ తరహా డ్రోన్ దాడులకు పాల్పడుతోంది. అయితే భారత వాయుసేన పాక్ ప్రయోగించిన దాదాపు 8 క్షిపణులు, డ్రోన్‌లను కూల్చేసింది.

# బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం



**నారాయణపేట టౌన్, మే 9 (పెన్ సత్తా):** ఆకస్మిక మృతి చెందిన జిల్లా జర్నలిస్టులు యాదగిరి, మహేశ్, రాఘవేందర్ కుటుంబాలకు జర్నలిస్టు సంక్షేమ నిధి నుంచి మంజూరైన రూ.లక్ష చెక్కును శుక్రవారం రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. హైదరాబాద్‌లోని మీడియా అకాడమీ ఆఫ్ తెలంగాణ భవన్‌లో నిర్వహించిన 'జర్నలిస్టుల సంక్షేమం – ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యం' అనే కార్యక్రమంలో జిల్లాకు చెందిన చెందిన ముగ్గురు జర్నలిస్టు కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని అందించారు. బాధిత కుటుంబాల్లో విద్యార్థుల చదువు కోసం ప్రతీనెల రూ.1000, మృతుడి భార్యకు ప్రతీనెల రూ. 3 వేల పెన్షన్ అందనుందని టీయూడబ్ల్యూజే ఐజేయూ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు కోయిల్‌కొండ నారా యణరెడ్డి తెలిపారు. అలాగే ఇటీవల మృతి చెందిన ఊట్కూరు మండల ఉర్దూ రిపోర్టర్‌కు వీలైనంత త్వరగా ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈనెల చివరి వరకు పేట జిల్లాకు చెందిన జర్నలిస్టు కుటుంబాలకు హెల్త్ క్యాంపు నిర్వహించబోతున్నామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరహాత్అలీ, కార్యదర్శి మధుగౌడ్, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, దిశా మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా బ్యూరో చేగూరి నరసింహులు, రఘు, గణప, నక్క శ్రీనివాస్, ఆకుల రాజేష్, సంజీవ, ప్రకాష్, విఠోభా తదితరులున్నారు.

# తెలుగు బిడ్డ మురళీ నాయక్ వీర మరణంపై విచారం వ్యక్తం చేసిన ఎంపీ







**అనకాపల్లి, మే 9 (పెన్ సత్తా):** పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో మన తెలుగు బిడ్డ మురళీ నాయక్ వీర మరణం పొందడం తీవ్ర వేదనను కల్గించింది అని విచారం వ్యక్తం చేసిన అనకాపల్లి ఎం.పీ సీఎం రమేష్. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా జమ్మూ కాశ్మీర్ యుద్ధభూమిలో వీరోచితంగా పోరాడుతూ మన తెలుగు బిడ్డ సత్యసాయి జిల్లా కల్లితండాకు చెందిన జవాను మురళీ నాయక్ వీర మరణం పొందడం పట్ల రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్, అనకాపల్లి పార్లమెంటు సభ్యులు డాక్టర్ సీఎం రమేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేశ రక్షణ కోసం ప్రాణాలు విడిచిన మురళీ నాయక్ వీర మరణం తెలుగు ప్రజలకే కాక దేశ ప్రజలందరికీ స్ఫూర్తి దాయకం అని పేర్కొన్నారు. పాకిస్తాన్‌తో యుద్ధంలో మురళీ నాయక్ ప్రదర్శించిన ధైర్యసాహసాలకు మన తెలుగు రాష్ట్రాల తరఫున జేజేలు పలికారు. మురళీ నాయక్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ దేవుడ్ని ప్రార్థిస్తు వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలుగా మురళీ నాయక్ కుటుంబాన్ని ఆదుకుంటుంది అని తెలియజేసారు.

## ఆపరేషన్ సిందూర్.. తెలంగాణ ప్రభుత్వం కీలక ఆదేశాలు

**హైదరాబాద్, మే 9 (పెన్ సత్తా):** ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో పోలీస్ అధికారులు సమగ్ర యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. జిల్లా కేంద్రాల్లోనూ ర్యాలీలు నిర్వహించాలని అన్నారు. ఇవాళ(శుక్రవారం) రాష్ట్ర సచివాలయంలో శాంతి భద్రతలపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన హై లెవెల్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రులు దుదిల్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, సీఎస్ రామకృష్ణారావు, సీఎంవో స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, డీజీపీ జితేందర్, పోలీస్ కమిషనర్లు సీవీ ఆనంద్, అవినాష్ మహంతి, సుధీర్ బాబు, తదితరులు పాల్గొన్నారు. డిఫెన్స్ మాక్ డ్రిల్, భద్రతలు, రక్షణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై మల్లు భట్టి విక్రమార్క చర్చించారు. ఇతర రాష్ట్రాల్లో ఉన్న తెలంగాణకు సంబంధించిన విద్యార్థులు ఆందోళనకు గురి కాకుండా నిత్యం సమాచారం కోసం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నామని అన్నారు. ఈ సందర్భంగా పోలీసులకు మల్లు భట్టి విక్రమార్క కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ముందస్తుగా అవగాహన కల్పించి మాక్ డ్రిల్ చేపట్టాలని సూచించారు.

# మురళీ నాయక్‌కి నివాళులు అర్పించిన చంద్రబాబు



**అమరావతి, మే 9 (పెన్ సత్తా):** పాకిస్థాన్ సైన్యం జరిపిన కాల్పుల్లో వీరమరణం పొందిన జవాన్ మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి అశ్రునివాళులు అర్పించారు సీఎం చంద్రబాబు. వీరజవాన్ మురళీ నాయక్ ప్రాణాలు కోల్పోవడం తీరని విషాదమన్నారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సీఎంతోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు వీరజవాన్‌కు నివాళులు అర్పించారు.

# గ్రామాలలో పూర్తి పరిశుభ్ర వాతావరణం నెలకోల్పే దిశగా కృషి చేయాలి





**దెందులూరు, మే 9 (పెన్ సత్తా):** గ్రామాలలో పూర్తి పరిశుభ్ర వాతావరణం నెలకోల్పే దిశగా కృషి చేయాలని గ్రామ పంచాయతీ, సచివాలయ అధికారులకు, సిబ్బందికి, కూటమి నాయకులకు, కార్యకర్తలకు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు. పెదవేగి మండలం వేగివాడ గ్రామంలోని బీసీ కాలనీలో శుక్రవారం ఉదయం స్థానిక కూటమి నాయకులతో కలిసి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని పర్యటించారు. గ్రామంలో ఉన్న రోడ్లను డ్రైనేజీలను దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధ్వానంగా ఉన్న రోడ్లపై సత్వరమే గ్రావెల్ ఏర్పాటు చేసి కాలనీవాసులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. అధ్వానంగా ఉన్న మురుగు నీటి డ్రెయినేజీల విషయంలో కూడా మరమ్మత్తులు చేపట్టాలని, గ్రామాల్లో ఎవరూ కూడా చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా ఉండేలాగా ప్రజలకు అవగాహన కలిగించాలి అన్నారు. చెత్తను తొలగించే విషయంలో కూడా పంచాయతీ అధికారులు ప్రత్యేక చొరవ చూపి గ్రామాలను అందంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంలో కృషి చేయాలని, ఒక్క వేగివాడ గ్రామంలోనే కాకుండా దెందులూరు నియోజకవర్గ పరిధిలోని 85 గ్రామాల కూటమి నాయకులు, అధికారులు కూడా తమ గ్రామాల పరిశుభ్రత పై ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, పంచాయతీ, సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతీకారంతో దూకుడు పెంచిన పాక్






**న్యూఢిల్లీ :** పాకిస్థాన్‌పై భారత్ జవాబి దాడుల నేపథ్యంలో కరాచీ పోర్టుపై నావికాదళం దాడి చేసి, ధ్వంసం చేసింది. పాక్‌లోని పలు ప్రాంతాల్లో కూడా దాడులు చేసింది. దీంతో పాకిస్తాన్ అల్లాడిపోతూనే, మరో ప్రక్క ప్రతీకార కాంక్షతో రగిలిపోతూ దూకుడు పెంచి లైన్ ఆఫ్ కంట్రోల్ పొడువునా దాడులకు పాల్పడింది. భారత్‌పై ప్రతీకారం తీర్చుకోవడానికి పాక్ అన్ని విధాలుగా ప్రయత్నిస్తోంది. ఏ అవకాశాన్ని వదిలిపెట్టడం లేదు. నిన్న 15 చోట్ల సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు చేసింది. చైనా మిస్సైల్స్, డ్రోన్లతో రెచ్చిపోయింది. అయితే, భారత్ టెక్నాలజీ ముందు పాక్ ప్రయత్నాలు వీగిపోయాయి. ఆ మిస్సైల్స్, డ్రోన్లను భారత సైన్యం ధ్వంసం చేసింది. ఈ నేపథ్యంలోనే కరాచీ పోర్టుపై నావికాదళం దాడి చేసి, ధ్వంసం చేసింది. పాక్‌లోని పలు ప్రాంతాల్లో కూడా దాడులు చేసింది. దీంతో పాకిస్తాన్ బెంబేలెత్తిపోతూనే ప్రతీకార కాంక్షతో రగిలిపోతోంది. దూకుడు పెంచి లైన్ ఆఫ్ కంట్రోల్ పొడవునా దాడులకు పాల్పడింది. మిలటరీ స్టేషన్లను ఇతర నగరాలను టార్గెట్ చేస్తూ మిస్సైల్స్, డ్రోన్లను ప్రయోగించింది. అయితే, భారత్ వాటిని సమర్థవంతంగా ధ్వంసం చేసింది.

ఇక, సరిహద్దు ప్రాంతాల్లో యుద్ధ ప్రభావం కనిపిస్తోంది. చండీఘర్‌లో ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ హెచ్చరికలు జారీ చేసింది. పాకిస్తాన్ ఏరియల్ అటాక్స్‌కు పాల్పడే అవకాశం ఉం దని తెలిపింది. ప్రజలు ఇంటిలోనే ఉండాలని, బయటకు రావద్దని స్థానిక అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బాల్కనీలకు దూరంగా ఉండాలని అన్నారు. పాకిస్తాన్ దాడులకు పాల్పడుతున్న వేళ ఇండియా ముందస్తు చర్యలను వేగవంతం చేసింది. ఈ నేపథ్యం లోనే 24 ఎయిర్ పోర్టులను బంద్ చేసింది. ఛండీఘర్, శ్రీనగర్,




అమృత్‌సర్, లుధియానా, షిమ్లా, జోద్‌పూర్, జమ్మూ, పఠాన్ కోట్ ఎయిర్ పోర్టులను భారత విమానయాన శాఖ మూసేసింది. ఇక, పంజాబ్ ఆరు సరిహద్దు జిల్లాల్లోని అన్ని స్కూళ్లను మూసే సింది. శనివారం వరకు స్కూళ్లు బంద్‌లోనే ఉండనున్నాయి. రాజస్తాన్ కూడా స్కూళ్లతో పాటు కాలేజీలను మూసేసింది. దిల్లీ లోని పలు స్కూళ్లు కూడా సెలవులు ప్రకటించాయి.

## మంత్రే కాదు, చక్కని రైతు, నిరంతర శ్రామికుడు



**గోదావరి, మే 9 (పెన్ సత్తా):** ఆయన నాయకుడే కాదు, బహుముఖ ప్రజ్ఞా పాటవాలు, కఠోర శ్రామికుడుకూడా. ఆయన రాజకీయా ల్లోకి రాక ముందు పూర్వం వృత్తిరీత్యా అధ్యాపకుడిగా పనిచేసారు. అంతే కాదు తనకంటూ ఉన్న సొంత పొలంలో ఆయన బహు చక్కని రైతుగా కూడా ఉన్నారు. గోదావరి జిల్లా ప్రేమను అందరికీ పంచుతూ సగటు మనిషిగా అందరి లోనూ కలసిపోతూ మంచి మాటకారిగా సమయస్ఫూర్తి కలిగిన వారిగా మెలిగారు. అందుకే ఆయనను రాజకీయాల్లో తెలుగుదేశం పార్టీ ఎంతో ప్రోత్సహిం చింది. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన ఈ రోజు కీలకమైన జలవనరుల శాఖకు మంత్రిగా ఉన్నారు అంటే ఆ ఘనత అక్షరాలా రామానాయుడుదే. ఇదిలా ఉంటే రామా నాయుడుని ఆదర్శ రైతుగా కూటమి ప్రభుత్వం గుర్తించింది. ఒక రైతుగా ఆయన చేసిన సేవలను ప్రభుత్వ అధికారులు మెచ్చుకుంటున్నారు. దాళ్వా వరి సాగుతో ఎకరానికి ఏకంగా 65 బస్తాలు అధిక దిగుబడులు సాధించి రైతుగా రామానాయుడు సత్తా చాటారు. తన సొంత పొలంలో సాధించిన ఫలితాలతో రైతాంగానికి ఆయన ఒక స్ఫూర్తి దాతగా మారారు. ఆ వివరాలను వ్యవసాయ అధికారిణి పార్వతి మీడియాకు చెబుతూ రామా నాయుడులోని రైతు బిడ్డను ఆవిష్కరించారు. అతి తక్కువ పెట్టు బడులతో అధిక దిగుబడులు ఎలా సాధించాలో ఆచరణలో ఆయన చేసి చూపించారు. ఇక్కడ రామా నాయుడు అనుసరించిన యాజమాన్య పద్ధతులు శాస్త్రవేత్తలు వయ్వసాయ అధికారుల సూచనలు సలహాలు తీసుకుని ఆయన చేసిన సాగు వంటికి హైలెట్ చేస్తున్నారు. పాల కొల్లులో ఉత్తమ రైతుగా రామా నాయుడు నిలిచారు. రామానాయుడు పాలకొల్లులోని అగర్తిపాలెం గ్రామంలో తన ఆరు ఎకరాల విస్తీర్ణంలో వరి పిఆర్ 126 సన్న రకం దాల్వా సాగు చేశారు. ఇలా ఎకరానికి 65 బస్తాల దిగుబడితో మొత్తం ఆరు ఎకరాలలో 390 బస్తాల దిగుబడిని సాధించారు. ఇలా అతితక్కువ పెట్టుబడితోనే మంత్రి ఒక రైతుగా ఎంత చేయ వచ్చో అంతా చేసి చూపించారు. దీనితో అతి తక్కువ పెట్టుబడితో అధిక లాభాలను ఆయన పొందడమే కాదు వ్యవసాయం పండుగ అని నిరూపించారు. ఒక వైపు ఎమ్మెల్యేగా ఉంటూ మరో వైపు మంత్రిగా కీలక శాఖను చూస్తూ బిజీ లైఫ్ గడిపే ఆయనకు ఎక్కడ తీరుబాటు ఉందో తెలియదు కానీ రైతుగా మారిపోయి ఇలా పంట సిరులని పండించారు. ఇక ఆయన తన సమయాన్ని ఎలా వ్యవసాయం కోసం వెచ్చించేవారు అంటే వారంలో రెండు రోజుల సమయం ఖాళీ చేసుకుని పోలం లోకి దిగిపోయేవారు. స్వయంగా నాట్లు వేయడం నుంచి ఎరువులు వేయడం పురుగుల మందులు జల్లడంతో పాటు ఇల అనేక రకాలైన పనులను సాటి వ్యవసాయ కూలీలతో పాటు కలసి చేసేవారు. ఇలా సస్యరక్షణ చర్యలను వ్యవసాయ శాఖ సూచనల మేరకు తీసుకుని సక్సెస్ ఫుల్ ఫార్మర్‌గా నిలిచారు. ఇలా ఆదర్శ రైతుగా మారిన మంత్రిని అంతా అభినందిస్తున్నారు.

## షరీఫ్‌పై పాక్ ఎంపీ నిప్పులు

### - నువ్వేం ప్రధానివి మోదీ పేరెత్తడానికే భయపడుతున్నావ్



**పాకిస్థాన్ :** భారత్ యుద్ధానికి దిగిన వేళ పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్, విమర్శల సుడిగుండంలో చిక్కుకున్నారు. స్వదేశంలో రాజకీయంగా ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. ప్రత్యర్థి పార్టీలు ఆయన పనితీరును తప్పు పడుతున్నాయి. నిండు పార్లమెంట్‌లో ఏకిపడేస్తోన్నాయి. పాకిస్తాన్ ఎంపీ ఒకరు షెహబాజ్ షరీఫ్ పై నిప్పులు చెరిగారు. ఆయనను పిరికిపందగా అభివర్ణించారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేరు ఉ చ్ఛరించడానికి కూడా భయపడే పిరికివాడిగా విమర్శించారు. భారత్ అన్నా, ఆ దేశ ప్రధాని మోదీ అన్నా భయపడే వ్యక్తి తమ దేశాన్ని పాలిస్తోన్నాడని ధ్వజమెత్తారు. పహల్గామ్ ఉగ్రవాద దాడిలో తమ ప్రమేయం ఏమీ లేదని నిరూపించుకునే విషయంలో ప్రధాని షెహబాజ్ షరీఫ్ విఫలం అయ్యారని ఆయన ఆరోపించారు. ఒక వంక భారత్ దూకుడుగా వ్యవహరిస్తోంటే దానికి భిన్నంగా పాకిస్తాన్ నాయకత్వం ప్రవర్తించిందని, ఆత్మరక్షణలో పడిందని విమర్శించారు. తమ దేశం పైకి యుద్ధానికి దిగినా కూడా భారత్‌కు వ్యతిరేకంగా ఒక్క ప్రకటన కూడా ప్రధాని షెహబాజ్ షరీఫ్ నుంచి రాలేదని గుర్తు చేశారు. భారత్ సరిహద్దులో నిల్చున్న పాకిస్తాన్ సైనికులు గానీ, ఇతర ప్రభుత్వ యంత్రాంగాలు గానీ ధైర్యంగా పోరాడుతున్నాయని, ప్రధాని షరీఫ్ మాత్రం ఎటువంటి ప్రకటన చేయట్లేదని మండిపడ్డారు. ఒక దేశ ప్రధానమంత్రి సింహంలాంటి వాడు అయినప్పుడు ఆ దేశ ప్రజలు కూడా సింహంలాగే శత్రువులపై పోరాడుతారని ఆ ఎంపీ వ్యాఖ్యానించారు. అదే ఆ సింహాల నాయకుడు పిరికివాడ అయినప్పుడు దేశ ప్రజలు కూడా పిరికిపందలుగా మారుతారని, ఎప్పుడూ గెలవలేరని, యుద్ధాలను కూడా ఓడిపోతారని అన్నారు. భారత ప్రధాని మోదీ పేరు ఉచ్ఛరించడానికి కూడా భయపడే ఓ పిరికివాడు పాకిస్తాన్ ప్రధాని అయినప్పుడు సరిహద్దులో పోరాడుతున్న సైనికులకు ఏ సందేశం ఇవ్వగలమని ఆ ఎంపీ నిండు పార్లమెంట్‌లో ప్రశ్నిం చారు. దేశ ప్రజల్లో ధైర్యం నూరిపోయాల్సిన నాయకత్వం ఇప్పుడు అవసరమైందని వ్యాఖ్యానించారు.

## జవాన్ మురళీ నాయక్‌కు లోకేష్ నివాళులు




**అమరావతి, మే 9 (పెన్ సత్తా):** భారత్ – పాక్ యుద్ధ భూమిలో తెలుగు జవాన్ మురళీ నాయక్ వీరమరణం పొందాడు. రాష్ట్రానికి చెందిన తెలుగు జవాన్ యుద్ధ భూమిలో వీరమరణం పొందడం పైహౌరాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ స్పందించారు. దేశ రక్షణలో మురళి నాయక్ ప్రాణాలు కోల్పోవడం బాధాకర మని, ఆయన చూపిన ధైర్య, సాహసాలు రాష్ట్రానికే గర్వ కారణ మంటూ ఎక్స్ వేదికగా మురళీ నాయక్‌కు మంత్రి నివాళులర్పిం చారు. దేశ రక్షణలో శ్రీ సత్యసాయి జిల్లా, పెనుకొండ శాసనసభ నియోజకవర్గం గోరంట్ల మండలానికి చెందిన మురళీ నాయక్ అనే సైనికుడు ప్రాణాలు కోల్పోవడం విషాదకరం. దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుడు మురళీ నాయక్‌కు నివాళులు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తు న్నాను లోకేష్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా జమ్మూ కశ్మీర్ యుద్ధ భూమిలో పోరాడుతూ మన రాష్ట్రానికి చెందిన మురళి నాయక్ వీరమరణం పొందడం నన్ను తీవ్ర ఆవేదనకు గురి చేసింది. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం గోరంట్ల మండలం గడ్డం తండా, పంచాయతీ కల్లి తండా గ్రామానికి చెందిన మురళీ నాయక్ చూపిన ధైర్య, సాహసాలు రాష్ట్రానికే గర్వకారణం. మురళీ నాయక్ పార్థివదే హానికి రాష్ట్ర ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిపిస్తాం. ఆయన కుటుంబానికి అన్నివిధాలా అండగా నిలుస్తాం అని మంత్రి లోకేష్ ట్వీట్ చేశారు. భారత్ – పాకిస్థాన్ మధ్య జరుగుతున్న ఉద్రిక్తతల్లో తెలుగు జవాన్ మురళీ నాయక్ నేలకొరి గాడు. శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన మురళీ నాయక్ ఇండియన్ ఆర్మీలో పనిచేస్తున్నారు. గురువారం రాత్రి యుద్ధ భూమిలో జవాన్ వీరమరణం పొందాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మురళీ నాయక్ మృతదేహాన్ని రేపు (శనివారం) స్వస్థలానికి తీసుకు రానున్నారు.

## టెరిటోరియల్ ఆర్మీ సభ్యులుగా కపిల్, ధోనీ, సచిన్‌కు బార్డర్ నుంచి పిలుపు



**ముంబై :** అన్ని నిబంధనలు తుంగలోకి తొక్కి భారత్ పైకి దాడు లతో రెచ్చిపోతున్న పాకిస్థాన్‌కు ఇండియన్ ఆర్మీ గట్టి బుద్ధి చెబు తోంది. నిన్నటి నుంచి పాక్ చేస్తున్న క్షిపణి, డ్రోన్ దాడులను భారత్ తిప్పికొడుతోంది. ఈ క్రమంలో ఇవాళ రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్, త్రివిధ దళాధిపతులతో సమావేశమయ్యారు. ఆపరేషన్ సిందూర్ తదనం తరం పరిణామాలపై ఈ భేటీలో చర్చించారు. ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, నౌకాదళ చీఫ్ అడ్మిరల్ దినేష్ కే త్రిపాఠి, వైమానిక దళ అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ లు హాజరైన ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ క్రమంలో ఇండియన్ ఆర్మీని మరింత దృఢంగా తయారు చేసేందుకు అవసరమైతే టెరిటోరియల్ ఆర్మీని రంగంలోకి దించా లని ఇవాళ కేంద్రం ఆర్మీ చీఫ్‌కు అధికారాలు ఇచ్చింది. రంగం లోకి టెరిటోరియల్ ఆర్మీ, భారత్ – పాక్ మధ్య నెలకొన్న టెన్షన్ వాతావరణం నేపథ్యంలో ఆర్మీ చీఫ్ అధికారాలను విస్తరిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టెరిటోరియల్ ఆర్మీలోని అందరు అధికారులను, నమోదు చేసుకున్న సిబ్బందిని పిలవడానికి అధికారం కల్పిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. దేశం క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పుడు భారత ఆర్మీతో కలిసి ప్రత్యర్థితో తలపడేందుకు టెరిటోలన్ ఆర్మీ సిద్ధంగా ఉంటుంది. ఇందులో సిబ్బంది, అధికారులకు రెగ్యులర్ ఆర్మీ తరహాలోనే ట్రైనింగ్ ఇస్తారు. వీరంతా బయట ఉద్యోగాలు చేసుకుంటూనే స్వచ్ఛందంగా ఆర్మీతో పని చేస్తుంటారు. ఇందులో కనీస అర్హత సర్వీస్ పూర్తి చేసిన వారికి పింఛనుతోపాటు ఇతర ప్రయోజనాలు (క్యాంటీన్, మెడికల్, ఎల్‌టీ అలవెన్సులు) అందిస్తారు. 1962, 1965, 1971 యుద్ధాల్లో భారత సైన్యంతో కలిసి ఈ టెరిటోరి యల్ ఆర్మీ పనిచేశారు. అందులో ఇప్పటికిప్పుడు 14 టెరిటోరి యల్ ఆర్మీ బెటాలియన్లను విధుల్లోకి తక్షణమే రప్పించాలని నిర్ణయించారు. పార్ట్ టైమ్ వాలంటీర్లతో కూడిన మిలటరీ రిజర్వ్ ఫోర్స్. ఇందులో అధికారులు, జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్లు, నాన్–కమిషన్డ్ ఆఫీసర్లు ఇతర సిబ్బంది ఉంటారు. వీరు భారత సైన్యంలోని వారితో సమానమైన ర్యాంక్‌లను కలిగి ఉంటూనే సమాజంలో తమ పనులు తాము చేసుకుంటారు. టెరిటోరియల్ ఆర్మీలో చాలా మంది ప్రముఖులు, సెలబ్రెటీలు ఉన్నారు. టీమిం డియా మాజీ కెప్టెన్ కపిల్ దేవ్, మాజీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్, టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని, షూటర్ అభినవ్ బింద్రా, అనురాగ్ ఠాకూర్, సచిన్ పైలట్, మలయాలం యాక్టర్ మోహన్ లాల్, నానా పటేకర్ తదితరులు ఈ టెరిడోరియల్ ఆర్మీలో ఉ న్నారు. ఇందులో ఎంఎస్ ధోని, లెఫ్టినెంట్ కల్నల్ హోదాలో 106 ఏ టీఏ బెటాలియన్ ప్యారా చూట్ రెజిమెంట్‌లో ఉండగా, సచిన్ టెండూల్కర్ భారత వైమానిక దళంలో గ్రూప్ కెప్టెన్‌గా ఉ న్నారు. అయితే దేశ రక్షణలో టెరిటోరియల్ ఆర్మీ పాత్ర ముఖ్య మైనది. ఈ నేపథ్యంలో ధోని, సచిన్ వంటి క్రికెటర్లను యుద్ధానికి పంపితే, వారి పాత్ర కూడా ముఖ్యమైనది కావచ్చు. కానీ అది పూర్తిగా సైన్యం అవసరాల పై ఆధారపడి ఉంటుంది. గతంలో భారత స్టార్ క్రికెటర్ హేము అధికారి రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొన్నారు. ఆ సమయంలో, అతనికి లెఫ్టినెంట్ కల్నల్ హోదా లభించింది.

## 30 రకాల నవధాన్య విత్తనాలతో 160 కిట్స్ తయారు




**నాతవరం, మే 9 (పెన్ సత్తా):** పాయకరావుపేట వ్యవసాయ సబ్ డివిజన్ నాతవరం మండలంలో పికె గూడెం యూనిట్ 100% ప్రకృతి వ్యవసాయ గ్రామం అయినటువంటి ఎస్‌బి పట్నం గ్రామంలో గ్రామ సర్పంచ్ సతీష్ ఆధ్వర్యంలో 30 రకాల నవధాన్య విత్తనాలతో 160 కిట్స్ తయారు చేయడం జరిగినది. గ్రామ సర్పంచ్ సతీష్ ఈ నవధాన్యాల వేయడం వల్ల ఉపయోగాలు గురించి వివరించి చెప్పడం జరిగినది.

నవధాన్య విత్తనాలు వేయడం వల్ల భూమి సారవంతం అవుతుంది, సూక్ష్మజీవులు అభివృద్ధి చెందుతాయి, భూమి గుల్ల బారుతుంది. నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. పురుగులు తెగుళ్లు రావు అలాగే భూమిలోని సేంద్రియ కర్బను శాతం స్థిరంగా ఉంటుంది. అలాగే ప్రధాన పంట దిగబడి బాగుంటుంది, అలాగే పశువులకు మేతగా ఉప యోగించుకోవడం వల్ల పశువులు ఆరోగ్యంగా ఉంటాయి పాలు దిగిబడి బాగా వస్తుంది వెన్న శాతం పెరుగుతుంది అని జిల్లా బ్లూమ్ ఇన్చార్జి గోవింద వివరించి చెప్పడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శైలజ, విఏఏ విజయ సాహితీ గ్రామ పెద్దలు ఏపి సిఎన్ఎఫ్ సిబ్బంది వెంకటలక్ష్మి MT, L1, icrps నారాయణమూర్తి, దుర్గా మాతాజీ, ధనలక్ష్మి, సంధ్య, గణేష్ హాజరు కావడం జరిగింది.

# బలుచిస్తానీలకు స్వాతంత్ర్యం, రెండు ముక్కలైన పాకిస్తాన్

## - క్వెట్టాను స్వాధీనం చేసుకున్న బీఎల్ఏ - క్వెట్టాను వదిలి పరారైన పాకిస్థాన్ సైన్యం - బలూచిస్థాన్‌లో స్థానికుల సంబరాలు

**న్యూఢిల్లీ:** పాకిస్థాన్ మరోసారి రెండు ముక్కలు కానుందా, అంటే అవుననే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. మనతో పాటు స్వాతంత్ర్యం పొందిన పాకిస్థాన్, విశాల దేశాన్ని పాలించడంలో విఫలమైంది. 1971 లో తూర్పు పాకిస్తాన్‌లో రాజకీయ, ఆర్థిక అసమానతలు, బెంగాలీ భాషా ఉద్యమం కారణంగా ప్రజలు పాకిస్తాన్ పాలన పై తిరుగుబాటు చేశారు. ఇది బంగ్లాదేశ్ విముక్తి యుద్ధానికి దారితీసింది. బంగ్లాదేశ్ కు మద్దతు ఇచ్చిన క్రమంలో పాక్ పై భారత్ యుద్ధానికి దిగింది. బంగ్లాదేశ్ ఆవిర్భావానికి దారితీసిన 1971 నాటి భీకరమైన యుద్ధం దాదాపు 13 రోజులు కొనసాగి, డిసెంబరు 16 వ తేదీన ముగిసింది. ఈ యుద్ధంలో భారత సైనిక బలగాల దెబ్బకు పాకిస్థాన్ సైనికులు తోకముడిచి పారిపోయారు. పాకిస్థాన్ ఆర్మీ జనరల్ అమీర్ అబ్దుల్లా ఖాన్ నియాజీ తన 93,000 మంది సైనికులతో, భారత సైన్యం, ముక్తి-బాహిని ముందు లొంగిపోయారు. దీంతో తూర్పు పాకిస్థాన్ విభజనకు దారితీసింది. బంగ్లాదేశ్ అని పిలిచే కొత్త దేశంగా ఆవిర్భవించింది. పాకిస్తాన్ సైన్యాలను ఓడించి, బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ఏర్పడింది. మళ్లీ అలాంటి పరిస్థితులే ఇప్పుడు బలూచిస్థాన్‌లో కనిపిస్తున్నాయి. బలూచిస్థాన్, పాకిస్థాన్‌లో ఉన్నా



అక్కడి పౌరులకు స్వేచ్ఛ లేదు, విద్య, వైద్యం అందని పరిస్తితి. పాకిస్థాన్‌లో 44 శాతం విస్తీర్ణం ఉన్న బలూచిస్థాన్ ప్రాంతాన్ని పాక్ ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. అక్కడి ప్రజలను ద్వితీయ శ్రేణి పౌరులుగా పరిగణిస్తున్నాయి. దీంతో స్వతంత్ర దేశంగా ప్రకటించాలని అక్కడి పౌరులు 75 ఏళ్లుగా పోరాడుతున్నారు. ఇప్పుడు పాక్ పై భారత్ దాడి నేపథ్యంలో బలూచీలు తమ కలను సాకారం చేసే దిశలో ముందుకు సాగుతున్నారు. బ్రిటిష్ వాళ్లు 1947 ఆగస్టు 15 న భారత్, పాకిస్థాన్‌ను విభజించి, స్వాతంత్ర్యం ప్రకటించినా బలూచిస్థాన్ ప్రాంతం ఖాన్ ఆఫ్ కలాత్ అనే రాజు పాలనలో కొనసాగింది. అయితే 1948 మార్చిలో పాకిస్థాన్ ప్రభుత్వం సైనిక చర్యను చేపట్టి, ఈ ప్రాంతాన్ని ఆక్రమించుకుంది. పాకిస్థాన్‌లో విలీనం చేసుకుంది. పాకిస్థాన్ విస్తీర్ణంలో బలూచిస్థాన్ వాటా 44 శాతంగా ఉంటుంది. అయితే పాక్ జనాభాలో బలూచీల వాటా 7-8 మాత్రమే. పాక్ దురాక్రమణ నుంచి ఈ ప్రాంత ప్రజలు తిరుగుబాటు చేస్తున్నారు. ఈ ప్రాంతంలోని వనరులను పాకిస్థాన్, చైనా దోచుకుంటున్నాయి. యువకులను పాక్ సైన్యం అపహరిస్తోంది, అలా అదృశ్యమయ్యే వారి జాడ నేటికీ తెలియ లేదంటే, బలూచీల దుర్భర పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. 2000 సంవత్సరంలో బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) ఆవిర్భవించింది. స్వతంత్ర బలూచిస్థాన్ దేశం కోసం గెరిల్లా యుద్ధాలతో పాకిస్థాన్ సైన్యంపై దాడులు చేసేది. క్రమంగా బీఎల్ఏ బలం పుంజుకుంది. పాకిస్థాన్ సైనికులు, వారి కార్యాలయాలు, కంటోన్మెంట్ ప్రాంతాలు, పోలీస్ స్టేషన్లు, ప్రభుత్వ భవనాలను టార్గెట్‌గా చేసుకుని, దాడులు జరుపుతోంది. ప్రస్తుతం బీఎల్ఏ చీఫ్‌గా బషీర్ జైబ్ వ్యవహరిస్తున్నారు. 2018 వరకు ఆయన సోదరుడు అస్లాం బలూచ్ ఈ పదవిలో ఉండేవారు. ఆయన మరణం తర్వాత బషీర్ జైబ్ బాధ్యతలను స్వీకరించాక, బీఎల్ఏ మరింతగా పుంజుకుంది. గెరిల్లా పోరుతో పాటు, అధునాతన ఆయుధాల వినియోగం, ఐఈడీల ప్రయోగాలు పెరిగాయి. ఆయన నేతృత్వంలోని బీఎల్ఏ గ్వాదర్ పోర్టు వద్ద చైనా ఇంజనీర్లు, వారి వాహనాల పై ఐఈడీ దాడులు చేస్తోంది. తాజాగా మంగళ, బుధవారాల్లోనూ బలూచిస్థాన్‌లో ఐఈడీలు పేల్చి, 21 మంది సైనికులను హతమార్చింది. ఇటీవల క్వెట్టా-పెషావర్ మధ్య నడిచే జాఫర్ ఎక్స్‌ప్రెసను హైజాక్ చేసి, సంచలనం సృష్టించింది. స్వతంత్ర దేశంగా బలూచిస్థాన్‌ను సాధించడానికి పోరాటాలను ముమ్మరం చేసింది. క్వెట్టాను స్వాధీనం చేసుకున్న బలూచిస్థాన్ ఆర్మీ పాకిస్తాన్‌కు దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. ఒకవైపు భారత ఆర్మీ పాక్ మీద విరుచుకు పడుతోంది. మరోవైపు బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ కూడా దాడి చేస్తోంది. ప్రావిన్షియల్ రాజధాని క్వెట్టాతో అన్ని ఆర్మీ పోస్టులను స్వాధీనం చేసుకుంది. పాకిస్థాన్ సైన్యాన్ని బలూచిస్తాన్ నుంచి తరిమి కొట్టామని, క్వెట్టాను తమ ఆధీనంలోకి తీసుకున్నామని బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ ప్రకటించింది. క్వెట్టాలోని పాకిస్థాన్ దళాల ఫ్రాంటియర్ కార్ప్స్ ప్రధాన కార్యాలయం పై బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ దాడి చేసింది. బలూచి తిరుగుబాటుదారులు క్వెట్టాను తమ ఆధీనంలోకి తీసుకున్నారని, పాకిస్థాన్ సైన్యాన్ని అక్కడ నుంచి తరిమేశారని మీడియా వెల్లడించింది.

# పిల్లలకు వేసవి విజ్ఞాన శిబిరం



**అనకాపల్లి, మే 9 (పెన్ సత్తా):** చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జవహర్ కమ్యూనిటీ హాల్ గవర్ల అనకాపల్లిలో వేసవి విజ్ఞాన శిబిరంలో మూడో రోజు కార్యక్రమంలో భాగంగా ప్రముఖ క్రాఫ్ట్, డ్రాయింగ్ టీచర్ కొముండూరి జ్యోతిర్మయి పిల్లలకు డ్రాయింగ్ వేయడంలోని మెలకువలను నేర్పించి వారిచే డ్రాయింగ్ వేయించారు. డ్రాయింగ్ చేయడం వలన మనసుకు చాలా లాభాలు కలుగుతాయని, ఇది మెదడు పనితీరును మెరుగుపరుస్తుందని, ఒత్తిడిని తగ్గిస్తుందని, సృజనాత్మకతను పెంచుతుంది, కమ్యూనికేషన్ నైపుణ్యాలను కూడా మెరుగు పరుస్తుందినీ అని ఈ సందర్భంగా జ్యోతిర్మయి అన్నారు. ఈ కార్యక్రమంలో చిల్డ్రన్స్ క్లబ్ కన్వీనర్ బి ఉమామహేశ్వరరావు, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మారిశెట్టి వెంకట అప్పారావు, ఆళ్ల మహేశ్వర రావు, పెంటకోట వెంకట్రావు, ఆడారి రామలక్ష్మి పాల్గొన్నారు.

# భద్రతా దళాల కదలికల ప్రత్యక్ష ప్రసారాలను నిలిపి వేయాలి

## - జాతీయ భద్రతపై రాజ్‌నాథ్ సింగ్ సమీక్ష



**న్యూఢిల్లీ:** త్రివిధ దళాలు, ఉమ్మడి రక్షణ సేవలు (సిడిఎస్) ఉన్నతాధికారులతో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శుక్రవారం సమావేశమయ్యారు. జాతీయ భద్రత పై సమీక్ష నిర్వహించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. భద్రతా పరిస్థితికి సంబంధించిన ప్రతి అంశాన్ని ఈ సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది.హో రక్షణ కార్యకలాపాలు, భద్రతాదళాల కదలికలకు సంబంధించి ప్రత్యక్ష ప్రసారాలను నిలిపివేయాలని రక్షణ శాఖ మీడియా, డిజిటల్ ప్లాట్ ఫారమ్‌లను ఆదేశించింది. కార్గిల్ యుద్ధం, 26/11 ముంబయి దాడులు, కాందహార్ హైజాక్ వంటి గత సంఘటనలను ఉదహరిస్తూ సున్నితమైన సమాచారాన్ని బహిర్గతం చేయడం వలన రక్షణ కార్యకలాపాలకు ఆటంకం కలుగుతుందని పేర్కొంది. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, వైమానిక చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి, రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్‌లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. పశ్చిమ సరిహద్దులో భద్రతా పరిస్థితి భారత సాయుధ దళాల కార్యాచరణ సంసిద్ధతను రాజ్ నాథ్ సింగ్ సమీక్షించినట్లు రక్షణ శాఖ ప్రతినిధి తెలిపారు. రక్షణ మంత్రిత్వ శాఖ భారత్ తన సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి తన ప్రజల భద్రతను నిర్ధారించడానికి పూర్తిగా సిద్ధంగా ఉందని తెలిపింది. భారత సైనిక స్థావరాల పై పాకిస్తాన్ దాడులను తిప్పికొట్టిన మరుసటి రోజు ఈ సమావేశం జరిగింది. జమ్ము, పఠాన్ కోట్, ఉధంపూర్‌లతో పాటు పలు ప్రాంతాల్లోని సైనిక స్థావరాలు లక్ష్యంగా గురువారం రాత్రి పాక్ చేపట్టిన డ్రోన్‌లు, క్షిపణుల దాడిని భారత సైన్యం తిప్పి కొట్టిన సంగతి తెలిసిందే.

# అందుబాటులో ఎస్.ఎస్.సి. పబ్లిక్ పరీక్షల ఫలితాలు షార్ట్ మెమోలు

**అనకాపల్లి, మే 9 (పెన్ సత్తా):** మార్చి 2025 ఎస్.ఎస్.సి. పబ్లిక్ పరీక్షల ఫలితాలు షార్ట్ మెమోలు పాఠశాల విద్యాశాఖ వెబ్సైట్లో అందుబాటులో ఉన్నట్లు జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి జి. అప్పారావునాయుడు తెలిపారు. మార్చి 2025 ఎస్.ఎస్.సి. పబ్లిక్ పరీక్షలు 17.03.2025 నుండి 01.04.2025 వరకు జరిగాయని మరియు ఫలితాలు 23.04.2025న ప్రకటించబడ్డాయని మరియు షార్ట్ మెమోలు (సబ్జెక్టుల వారీగా మార్కుల మెమోరాండం) 08.05.2025 నుండి వెబ్సైట్లో అందుబాటులో కలవని తెలిపారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాల లాగిన్ ఆధారాలను ఉపయోగించి "సబ్జెక్టుల వారీగా యొక్క మెమోరాండం"ని డౌన్లోడ్ చేసుకుని మరియు సంతకం చేసిన కాపీలను వారి సంబంధిత పాఠశాలల విద్యార్థులకు అందజేయవలెనని, మెమోలలో ప్రదానోపాధ్యాయుడు లేదా తల్లిదండ్రులు గుర్తించిన ఏవైనా సవరణలను ఒరిజినల్ పాస్ సర్టిఫికెట్లలో సవరణలు చేయడానికి ప్రభుత్వ పరీక్షల సంచాలకులు, విజయవాడ, ఆంధ్ర ప్రదేశ్, దృష్టికి తీసుకు రావాలని తెలియజేయడమైనదన్నారు. కావున ఏవైనా సవరణలు ఉంటే అవసరమైన పత్రాలను అందించాలని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచిస్తూ, సవరణలకు అడ్మిషన్ రిజిస్టర్కు సరిగ్గా జతచేయబడిన పాఠశాల రికార్డుల రుజువు మరియు ప్రధానోపాధ్యాయుడు ధృవీకరించిన



షార్ట్ మెమో (సబ్జెక్ట్ వారీగా మార్కుల మెమోరాండం) కాపీ అందజేయాలని తెలిపారు. అందరి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పైన తెలిపిన ఆధారాల పత్రాలతో 25.05.2025 లోపు ప్రభుత్వ పరీక్షల సంచాలకులు, విజయవాడ, ఆంధ్ర ప్రదేశ్ పంపవలసియున్నదని తెలియజేసారు.

# ప్రాణహాని ఉంది...జెడ్ ప్లస్ భద్రత కల్పించండి : జగన్

**తాడేపల్లి, మే 9 (పెన్ సత్తా):** తనకు జెడ్ ప్లస్ కేటగిరీ భద్రతను తిరిగి కల్పించేలా కేంద్ర, రాష్ట్రాలకు ఆదేశాలివ్వాలంటూ మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హైకోర్టులో గురువారం పిటిషన్ దాఖలు చేశారు. కేంద్ర భద్రతా సంస్థలైన సిఆర్‌పిఎఫ్ లేదా ఎన్ఎస్‌ఓలతో భద్రత కల్పించకపోవడం రాజ్యాంగ విరుద్ధమని పిటిషన్‌లో తెలిపారు. తనకున్న ప్రాణహానిపై తాజాగా, స్వతంత్రంగా మదింపు చేయాలని, తనకు జెడ్ ప్లస్ భద్రతను పునరుద్ధరించేందుకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. వ్యక్తిగత భద్రతాధికారులు, జామర్లు, ఇల్లు, ఆఫీసు వద్ద భద్రత, పనిచేసే బుల్లెట్ ప్రూఫ్ వాహనం కల్పించాలని, ఇవి కల్పించని పక్షంలో తన సొంత బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని వాడుకునేందుకు అనుమతివ్వాలని కోరారు. సిఎంగా ఉండగా జెడ్ ప్లస్ భద్రత ఉండేదని, అధికారం కోల్పోవడంతో ఆ భద్రతను అన్యాయంగా ఏకపక్షంగా కుదించారని, ప్రాణహానిని పరిగణనలోకి తీసుకోలేదని పిటిషన్‌లో తెలిపారు. అధికార కూటమి నుంచి భౌతికంగా హానిచేస్తామనే బెదిరింపులు కూడా వస్తున్నాయని చెప్పారు. ఇదే అంశంపై గతంలో వేసిన పిటిషన్ హైకోర్టులో పెండింగ్‌లో ఉందని, వైసిపి ఎంపీలు, సీనియర్ నేతలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పలు వినతులు సమర్పించినా ఫలితం లేకపోయిందని తెలిపారు. ఫిబ్రవరిలో గుంటూరు మిర్చి యార్డ్‌లో రైతులను కలిసేందుకు వెళితే ఒక్క కానిస్టేబుల్ కూడా లేరని,



శ్రీసత్య సాయి జిల్లా కుంటి మద్ది గ్రామం నుంచి తన తిరుగు ప్రయాణం సందర్భంగా తీవ్రమైన భద్రతా లోపాలను బట్టబయలయ్యాయని, హెలీప్యాడ్ వల్ల భద్రతా లోపాలు వెలుగు లోకి వచ్చాయని పిటిషన్‌లో తెలిపారు. వైసిపి నేతలు, కార్యకర్తల పై అన్యాయంగా కేసులు బనాయిస్తున్నారని చెప్పారు. ఈ పిటిషన్‌ను శుక్రవారం హైకోర్టు విచారణ చేసే అవకాశముంది.

# త్వరలో భూగ్రహం అంతం కాబోతోంది : ఎలాన్ మస్క్




**అమెరికా :** స్పేస్ ఎక్స్ వ్యవస్థాపకుడు, ఎలక్ట్రిక్ వాహనాలు, అంతరిక్షం, సాంకేతిక రంగాల్లో దిగ్గజ వ్యాపారవేత్తగా ఎదిగారు ఎలాన్ మస్క్. ప్రస్తుతం ప్రపంచ కుబేరుల్లో ఒకరిగా ఎలాన్ మస్క్ ఉన్నారు. అయితే ఆయన తాజాగా ఓ కీలక అంశాన్ని ప్రస్తావించారు. త్వరలో భూగ్రహం అంతం కాబోతోందని మానవాళికి ఈ ఒక్క గ్రహం సరిపోదని అభిప్రాయపడ్డారు. సూర్యుడు విస్తరిస్తూ ఉన్నాడని అందువల్ల భూ గ్రహానికి పెను ముప్పు పొంచి ఉందని మస్క్ తెలిపారు. ఈ మేరకు ఎలాన్ మస్క్ అంగారక గ్రహంపై దృష్టి పెట్టారు. ఆ గ్రహం భవిష్యత్తులో మానవాళి ఉండేందుకు అనువుగా ఉందని చెప్తూ వస్తున్నారు. 2026 నాటికి అంగారక గ్రహాన్ని భాగాలుగా విభజించి, 2030 నాటికి మానవాళి అక్కడకు వెళ్లి నివాసం ఉండేందుకు పరిశోధనలు పూర్తవుతాయని అన్నారు. ఈ మేరకు ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మార్స్‌ను స్వాధీనం చేసుకోండి అనే అంశంపై ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వాతావరణ మార్పులతో పాటు వివిధ అంశాలపై ఆయన మాట్లాడారు. ప్రస్తుతం భూమి గ్రహం ఒక్కటే మానవాళికి సరిపోదు. సూర్యుడి విస్తరణ కారణంగా భూగ్రహానికి పెనుముప్పు రాబోతోంది. భూమికి ఏదైనా విపత్తు తలెత్తేలోపే ఇతర గ్రహాన్ని మానవుడు స్వాధీనం చేసుకోవడం ఉత్తమం. అంగారక గ్రహం మానవాళి నివాసానికి యోగ్యంగా ఉంటుంది. ఇందుకు సంబంధించిన పరిశోధనలు జరుగుతున్నాయి. సూర్యుడు క్రమంగా విస్తరిస్తున్నాడని, 440 మిలియన్ సంవత్సరాలకు సూర్యుడి వేడికి భూమిపై జీవం లేకుండా పోతుందని ఆయన అంచనా వేశారు. 2026 నాటికి అంగారక గ్రహం పై మానవ రహిత వ్యోమ నౌకను దించాలని. ఆ తర్వాత 2030 లోపు మానవులను పంపాలని మస్క్ చాలా సంవత్సరాల నుంచి ప్రకటిస్తూ వస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఇటీవల తన లక్ష్యాన్ని సవరించుకున్న ఆయన, 2029 నాటికి మానవులు ఈ గ్రహంపై అడుగుపెట్టే అవకాశం ఉందని వెల్లడించారు. ఈ మేరకు పరిశోధనలు ముమ్మరం చేసినట్లు పేర్కొన్నారు. స్టార్ షిప్ వ్యోమ నౌకను అంగారక కక్ష్యలోకి పంపడం, ప్రస్తుతం తమ ప్రథమ ప్రాధాన్యతలని మస్క్ స్పష్టం చేశారు.

# ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా వ్యతిరేకిస్తాం : చైనా

**చైనా :** ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా వ్యతిరేకిస్తాం అని చైనా స్పష్టం చేసింది. భారత్ - పాక్‌ల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి లిన్ జియాన్ మాట్లాడుతూ భారత్-పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా కానీ చైనా వ్యతిరేకిస్తుందంటూ ఆయన స్పష్టం చేశారు. సరిహద్దు దేశాలలో శాంతి నెలకొనాలని ఆకాక్షించారు. పొరుగు దేశాలైన భారత్-పాక్ అంతర్జాతీయ చట్టాలను పాటిస్తూ శాంతి, స్థిరత్వం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. పరిస్థితిని మరింత క్లిష్టతరం చేసే చర్యలకు పాల్పడకుండా సంయమనం పాటించాలని కోరారు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించడానికి అంతర్జాతీయ



సమాజంతో కలిసి, నిర్మాణాత్మక పాత్ర పోషించడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు ఆయన స్పష్టం చేశారు.

# సోమా రత్నయ్యకు ఘనంగా నివాళులు





**కోవూరు, మే 9 (పెన్ సత్తా):** కోవూరు మండలం గుమ్మలదిబ్బ గ్రామా నికి చెందిన కీర్తి శేషులు సోమా రత్నయ్య 4వ వర్ధంతిని పురస్క రించుకొని గురువారం రత్నయ్య జ్ఞాపకకార్ధంగా సతీమణి లక్ష్మి మ్మ, ఆమె తనయుడు సోమా గోపాల్ దంపతులు కుటుంబ సభ్యులు సంయుక్తంగా రత్నయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అన్న దానం కార్యక్రమం ఏర్పాటు చేసారు. రత్నయ్య చేసిన సేవలను ఆదర్శంగా తీసుకొని 4వ వర్ధంతి నేపథ్యంలో అన్నదాన కార్యక్ర మం నిర్వహించడం జరిగింది. ప్రతి యేటా వర్ధంతి రోజున అన్నదానం చెయ్యడం సోమా గోపాల్, రమ దంపతులకు సంప్ర దాయంగా చెప్పవచ్చు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# ఉత్తమ పురస్కార గ్రహీత అవార్డును గవర్నర్ చేతులు మీదుగా అందుకొన్న నెల్లూరు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

**నెల్లూరు/అమరావతి, మే 9 (పెన్ సత్తా):** రెడ్‌క్రాస్‌లో ఉత్తమ సేవలు అందించిన నెల్లూరు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌కు ఏపీ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులు మీదుగా ఉత్తమ పురస్కార అవార్డును గురువారం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అందుకొన్నారు. నెల్లూరు జిల్లాకు ఉత్తమ కలెక్టర్‌గా కూడా ఓ.ఆనంద్ చెరగని ముద్ర వేసుకొన్నారు.



# ఆత్మ విశ్వాసమే విజయానికి సోపానం

**- విపిఆర్ ఫౌండేషన్‌చే విక్రమ సింహపురి యూనివర్సిటీ అభివృద్ధి పనులకు రూ. 15 లక్షల ఆర్థిక సహాయం**
**- క్రీడలలో రాణించాలంటే కేవలం శారీరక శక్తి మాత్రమే కాదు, సహనం, తోటి ఆటగాళ్లను కలుపుకుపోయే నాయకత్వం లక్షణాలు అవసరం - క్రమశిక్షణ, కష్టపడేతత్వం వున్నవారే విజేతలవుతారు : కోవూరు - ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**






**నెల్లూరు/కోవూరు, మే 9 (పెన్ సత్తా):** క్రమశిక్షణ, కష్టపడేతత్వం వున్న వారే విజేతలవుతారని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిఅన్నారు. గురువారం విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో ఇంటర్ యూనివర్సిటీ సాఫ్ట్ బాల్ పోటీలలకు సంబంధించి విజేతలకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొని విజేతలకు ట్రోఫీలు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిమాట్లాడుతూ క్రీడలలో రాణించాలంటే కేవలం శారీరక శక్తి మాత్రమే కాదు, సహనం, తోటి ఆటగాళ్లను కలుపుకుపోయే నాయకత్వం లక్ష్యణాలు చాలా అవసరమన్నారు. విజేతలుగా ట్రోఫీలు అందుకున్న క్రీడాకారుల ప్రతిభ మరియు అంకితభావానికి దక్కిన గుర్తింపు ఆమె అభివర్ణిం చారు. కోచ్‌ల మార్గ దర్శకత్వం, తల్లితండ్రుల ప్రోత్సాహంతో పాటు అలుపెరుగని క్రీడాకారుల సాధనే గెలుపు అనే లక్ష్యాన్ని చేరువ చేసిందన్నారు. క్రీడలైనా మరే ఇతర ఇతర రంగమైనా విజయం సాధించాలంటే క్రమశిక్షణ, కష్టపడేతత్వంతో పాటు గెలవగలం అన్న ఆత్మ విశ్వాసం చాలా అవసరమన్నారు. ఆటలో గెలుపు ఓటములు సహజమన్నారు. ఓటమిని కూడా గౌరవంగా స్వీకరించడమే క్రీడా స్ఫూర్తికి నిదర్శనమన్నారు. విక్రమ సింహపురి యూనివర్సిటి అభివృద్ధి పనుల కోసం విపిఆర్ ఫౌండేషన్ తరుపున ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి 15 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, విక్రమ సింహపురి యూనివర్సిటి వైస్ ఛాన్సలర్ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ సునీత పలువురు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన విజిలెన్స్ సభ్యులు సుహాసిని



**కోవూరు /నెల్లూరు, మే 9 (పెన్ సత్తా):** కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని జిల్లా విజిలెన్స్ సభ్యులు, స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత్రి గాలి సుహాసిని గురువారం మర్యాద పూర్వకంగా కలిసి బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. తాను విజిలెన్స్‌లో సభ్యులుగా నియామకం అయిన తర్వాత తొలిసారిగా ఎమ్మెల్యేను కలవడం జరిగింది అని అన్నారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి అన్ని విధాలుగా తన ఆశీస్సులు ఉంటుందని భరోసా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాషా యూత్ ఫౌండేషన్ చైర్మెన్ వనమాల జనార్ధన్‌రావు, మత్స్యకార నేత కటారి సుబ్రహ్మణ్యం, బెజవాడ వంశీ కృష్ణ రెడ్డి, టీడీపీ ఇంచార్జి అడపాల శ్రీధర్ రెడ్డి, స్థానిక టీడీపీ నాయకులు, తదితరులు ఉన్నారు.

# దౌర్జన్యంగా జర్నలిస్టులు ఇంట్లో తనిఖీలు సరికాదు





**కోవూరు, మే 9 (పెన్ సత్తా):** సాక్షి పత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డిపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలను కోవూరు నియోజక వర్గం జర్నలిస్టులు తీవ్రంగా ఖండించారు. గురువారం కోవూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ, పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించి సంకెళ్ళు వేసే విధంగా పడ్డాయి. అనంతరం ఎపియుడబ్ల్యుజే జిల్లా ఉపాధ్యక్షుడు పెద్ది సాయిబాబు, సీనియర్ ప్రముఖ జర్నలిస్టులు కొమారి జనార్ధన్, శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ తీరును ఖండిస్తూ తహశీల్దార్ రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటి తహసిల్దార్ నాజర్ కు వినతిపత్రాన్ని అందజేశారు. ఎలాంటి నోటీసు ఇవ్వకుండా విజయవాడలో సాక్షి సంపాదకుని ఇంటిలో పోలీసులు బలవంతంగా చొరబడి తనిఖీలు చేసిన ధోరణి సరికాదని వర్కింగ్ జర్నలిస్టలకు దిగ్భ్రాంతి కలిగించిందని అన్నారు. పాత్రికేయులను భయపెట్టడానికి మాత్రమే పోలీసులు ఇలాంటి చర్యలకు పూనుకుంటున్నట్లు తాము భావిస్తున్నామని యూనియన్ నాయకులు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఒక ప్రముఖ పత్రికా సంపాదకుని ఇంటిలో సోదాలు జరపాలని పోలీసులు భావించి ఉంటే ముందుగా నోటీసు ఇచ్చి చట్టపరంగా వ్యవహరించాలని అన్నారు. పెద్ద సంఖ్యలో పోలీసులు ఇంటిలో చొరబడిన తీరు గర్హనీయమని యూనియన్ నాయకులు ఆ ప్రకటనలో ఆక్షేపించారు. ప్రభుత్వ పెద్దలకు సాక్షి యాజమాన్యంపై ఉన్న రాజకీయ వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకుని పోలీసులు సాక్షి జర్నలిస్టులపై ఇలాంటి చర్యలు తీసుకుంటున్నట్లు భావించాల్సి వస్తున్నదని, ఇలాంటి ధోరణి భావ్యం కాదని, సాక్షి పాత్రికేయులపై అక్రమ కేసులు బనాయించడం, సంపాదకుని ఇంటిలో సోదాలు చేయడం పాత్రికేయులను భయభ్రాంతులకు గురి చేయడానికేనని, యూని యన్ నాయకులు అభిప్రాయపడ్డారు. నోటీసులు లేకుండా ఇంట్లోకి చొరబడటం ప్రతిక స్వేచ్ఛకు విఘాతం కలిగించడంపై ప్రజా సంఘాలు మండిపడిందని అన్నారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాసినందుకే సాక్షిపై కక్ష సాధింపు చర్యలకు పూనుకుంటున్నారని ధ్వజంఎత్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇలాంటి వ్యవహారాలు చూసి కూడా చర్యలు తీసుకోకపోవడం సరి కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ జర్నలిస్టులు, మధు, సుధీర్, వంశీ, రాము, అశోక్, రవి, శ్రీను, పలువురు ఉన్నారు.

# రేగడ చేలిక గ్రామంలో టీడీపీకి బిగ్ షాక్





**కొడవలూరు, మే 9 (పెన్ సత్తా):** కొడవలూరు మండలం, రేగడ చేలిక గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు బత్తల కమల్ తేజ యాదవ్, కటారి భాను యాదవ్, డబ్బుకొట్టు నాగార్జున, డబ్బు కోట్టు నాని యాదవ్ కొడవలూరు మండలం వైసీపీ సేవాదళ్ అధ్యక్షుడు దేవనబోయిన శివకుమార్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీని వీడి వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు మాజీ మంత్రి, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, రాష్ట్ర వైసీపీ పిఏసి సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు ఆధ్వ ర్యంలో టీడీపీ వీడి వైసీపీలో చేరారు. దీంతో కొడవలూరు మం డలంలో టీడీపీకి గట్టి దెబ్బ తగిలిందని చెప్పవచ్చు. ఈ కార్యక్ర మంలో దేవనబోయిన నాగేంద్ర, నల్లావుల నరేష్, చెమకుల హజరత్, బకముం తల శ్రీనాథ్, ముచ్చు వంశీ పాల్గొన్నారు.

# జొన్నవాడ కామాక్షితాయి బ్రహ్మోత్సవాలను విజయవంతం చెయ్యండి

**- ఆలయంలో విఐపి కల్చర్‌కు చెక్ చెప్పండి...దైవ సన్నిధిలో అందరు సమానులే - సిసి కెమెరాల సామర్థ్యం పెంచి ఆకతాయిల ఆగడాలు అరికట్టండి - బ్రహ్మోత్సవాల సందర్భంగా జొన్నవాడ పరిసరాలలో మద్యం విక్రయాలను నియంత్రించండి - భక్తుల సౌకర్యాల కల్పనలో ఎక్కడా రాజీ పడవద్దు - విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లైటింగ్, ప్రసాదాలు, తెప్పోత్సవ ఏర్పాట్లు : కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**

**బుచ్చి, మే 9 (పెన్ సత్తా):** జొన్నవాడ కామాక్షితాయి బ్రహ్మోత్సవా లను అధికారులు మరియు ఆలయ సేవా కమిటి సభ్యులు పరస్పర సమన్వయంతో విజయవంతం చేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. గురువారం ఆమె ప్రెస్ మీట్లో మాట్లాడారు.. ఈ సందర్భంగా జొన్నవాడ విచ్చేసిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి ఆలయ అర్చకులు మరియు సేవా కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆమె ఈ నెల 17వ తేది నుంచి 27వ తేది వరకు జరిగే అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా చేయవలసిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ 10 రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగే అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా వేలాదిగా హాజరయ్యే భక్తులకు సౌకర్యాలు కల్పించవలసిన బాధ్యత మనపై వుందన్నారు. పోలీసు, రెవెన్యూ, ఎక్ట్రిసిటి మరియు ఫైర్, ఆర్‌టిసిలాంటి ప్రధాన శాఖల మధ్య సమన్వయం చాలా అవసర మన్నారు. అందరు సమిష్టి కృషితో కష్ట పడితేనే బ్రహ్మో త్సవాలు విజయవంతం చేయగలమన్నారు. బ్రహ్మోత్సవాలలో ముఖ్యమైన రావణసేవ, నందిసేవ, రథోత్సవం, కళ్యాణోత్సవం సందర్భంగా



ఎంత మంది వస్తారు అనే విషయంలో దేవాదాయ శాఖ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని భక్తులకు ఏర్పాటు చేయవలసిందిగా సూచించారు. వేసవి సందర్భంగా భక్తుల దాహర్తి తీర్చేందుకు సురక్షిత తాగునీటి సదుపాయం కల్పించాల న్నారు. వేల సంఖ్యలో వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకొని ఆలయ పరిసరాలలో షాపుల వారిని ఒప్పించి తాత్కాలికంగా ఆక్రమణలు తొలగించాలని అధికారులను ఆదేశించారు. పవర్ కట్ సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్




శాఖ అధికారులకు సూచించారు. విద్యుత్ ఓవర్ లోడ్ సమస్యను అధిగమించడానికి అవసరానికి సరిపడా జనరేటర్లు సిద్ధం చేసుకోవాలన్నారు.

బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్స్ పట్ల అప్రమత్తంగా వుండాలని కోరారు. ఫైర్ యాక్సిడెంట్‌లాంటివి జరిగితే నివారించటానికి ఫైర్ ఇంజన్లు సిద్ధంగా వుంచుకోవాలని స్నాన ఘట్టాల వద్ద ప్రమాదాలు నివారించేందుకు గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచుకోవాలాన్నారు. పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. వీలైనన్ని ఎక్కువగా మెడికల్ క్యాంప్స్ పెట్టండంతో పాటు అత్యవసర పరిస్థితులలో అంబులెన్సు అందుబాటులో ఉంకోవాలని ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. పెద్ద సంఖ్యలో హాజరయ్యే మహిళలను దృష్టిలో వుంచుకొని ఆకతాయిలు, అసాంఘిక శక్తు లపై ప్రత్యేక నిఘాతో పాటు ఎక్కువ ఏరియా కవర్ అయ్యేలా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని పోలీసులను కోరారు. ఆలయ పరిసరాలలో మద్యం విక్రయాలు జరగకుండా ఎక్సయిజ్ సిబ్బంది కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విఐపిల పేరుతో సామాన్య భక్తులకు ఎటువంటి యిబ్బందులు పెట్టవద్దని ఆలయ అధికా రులు మరియు అర్చకులకు హితవు పలికారు. పార్కింగ్ సమ స్యపై దృష్టి సారించాలని భక్తులకు ఎటువంటి అసౌకర్యం కల్గకుండా బ్రహ్మోత్సవాలు విజయవంతం చేసేందుకు కృషి చేయాలని అధికారులు మరియు ఆలయ సేవా కమిటి సభ్యులను కోరారు. ఈ కార్యక్రమలో ఆర్ డి ఒ అనూష, ఆలయ ఇఒ శ్రీనివాసులు రెడ్డి, సేవా కమిటి చైర్మన్ తిరుమూరు అశోక్ రెడ్డి, పెన్నా డెల్టా ఛైర్మెన్ జెట్టి రాజగోపాలరెడ్డి పాటు వివిధ శాఖల అధికారులు నియోజకవర్గం టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# రైతుల కష్టాన్ని ముంచుతున్న వర్షాలు

## - అయోమయానికి గురవుతున్న రైతులు





**సామర్లకోట, మే 9 (పెన్ సత్తా):** రైతుల కష్టాన్ని వర్షం ముంచెత్తుతోంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు రైతులకు గుండెల్లో దడ పుట్టిస్తుంది. గత మూడు రోజులుగా కాకినాడ జిలాలో భారీ వర్షాలు పడుతూ రైతుల దాన్యాన్ని తడిపి ముద్ద చేస్తున్నాయి. గురువారం ఉదయం నుండి ఎండ కాయడంతో బుధవారం కురిసిన వర్షానికి తడిచిన దాన్యాన్ని రైతులు పెద్ద ఎత్తున ఆరపోసారు. ఐతే మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు వచ్చి రెండు గంటలు నుండి మబ్బులు ఏర్పడి వర్షం పడడంతో రైతులు వారి ధాన్యం రాశుల వైపు పరుగులు తీశారు. ధాన్యపు రాశులపై బరకాలు, గడ్డి వేసి రక్షణ చర్యలు చేపడుతున్నారు. తడిసిన ధాన్యం ఏమాత్రం ఆరకుండానే మళ్ళీ మళ్ళీ వర్షాలు పడుతుండటంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. రైతు సేవా కేంద్రాల్లో సక్రమంగా ధాన్యం కొనుగోలు జరగటం లేదని, దాన్యాన్ని భద్రపరచుకొనేందుకు తమకు వసతులు లేవని రైతులు వాపోతున్నారు. తక్షణమే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేపట్టి రైతులను ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

# మండలంలో ఎంఎల్ఏ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం





**కరప, మే 9 (పెన్ సత్తా):** కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ కరప మండలంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

ఈ క్రమంలో వలసపాకల గ్రామంలోని ఎస్సీ పేటలో జలజీవన్ మిషన్ నిధులతో నిర్మించిన 20,000 లీటర్ల సామర్థ్య మున్న కొత్త వాటర్ హెడ్ ట్యాంక్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ ట్యాంక్ ద్వారా గ్రామంలోని 180 కుటుంబాలకు శుద్ధమైన మంచినీటి సరఫరా అందించనుందని తెలిపారు. గ్రామ స్థాయిలో మంచినీటి సౌకర్యాన్ని విస్తృతంగా అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో ఇది ఒక ముఖ్యమైన అంశం అని ఎమ్మెల్యే నానాజీ అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు భారీగా పాల్గొన్నారు.

# అన్నవరంలో అధికారులపై రెచ్చిపోయిన అనంతబాబు




**అన్నవరం, మే 9(పెన్ సత్తా):** : వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు అన్నవరం సత్యదేవుని ఆలయంలో ఓవరాక్షన్ చేశారు. గురువారం స్వామివారి కల్యాణం జరిగింది. ఈ సందర్భంగా అనంతబాబు సత్యదేవుని దర్శించుకున్నారు. అనంతరం అక్షింతలు ఆలస్యమవడంతో ఆయన ఆలయ అధికారులపై ఇలా రెచ్చిపోయారు. 'వాడెవడు.. వాడి పెత్తనం ఏమిటిక్కడ' అంటూ ఓవరాక్షన్ చేస్తూ రెచ్చిపోయారు. ఆలయానికి వచ్చిన తనకు తగిన గౌరవం ఇవ్వలేదంటూ హడావుడి చేశారు. అక్షింతలు ఇవ్వలేదని కల్యాణ వేదిక వద్దే ఉండిపోయారు. ముఖ్య అతిథులు వెళ్లిపోయినా అనంతబాబు అక్కడే ఉండి అక్షింతలు ఇవ్వాలని పట్టుపట్టారు. ఈవో సుబ్బారావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ అధికారిని ఉద్దేశించి దూషణలకు పాల్పడి అక్కడి నుంచి వెళ్లిపోయారు. మరోవైపు ఏపీలో పెను సంచలనం సృష్టించిన వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో విచారణ వేగవంతం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చోటు చేసుకున్న ఈ హత్యకు సంబంధించి నిందితుడు వైసీపీకి చెందిన వ్యక్తి కావడంతో పోలీసులు విచారణను పూర్తిగా నీరుగార్చిన పరిస్థితి. అదేవిధంగా ఛార్జ్‌షీట్ దాఖలులో అనేక లోపాలు కనిపించాయి. దీంతో ఈ కేసులో పురోగతి కనిపించకుండా పోయింది. అయితే ఇప్పుడు ప్రభుత్వం మారడంతో ఎట్టకేలకు కేసులో కదలిక వచ్చింది. ఈ కేసుకు సంబంధించి న్యాయం చేయాలంటూ బాధితులు కోరగా.. అందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ కూడా హామీ ఇచ్చారు.

# స్వయం ఉపాధిపై దృష్టి సాధించాలి

## - ఎస్ ఎస్ గ్రాండ్ ఇన్ ప్రారంభంలో ఎమ్మెల్యే, కుడా చైర్మన్‌లు



**సామర్లకోట, మే 9 (పెన్ సత్తా):** సమాజంలో యువత స్వయం ఉపాధిని సాధించాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబ)లు పిలుపునిచ్చారు. సామర్లకోట పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన "ఎస్ఎస్ గ్రాండ్ ఇన్" అతిథి గృహ సముదాయాన్ని ఎమ్మెల్యే చినరాజప్ప, కూడా చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు, మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి ప్రారంభించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ సమాజంలో యువత స్వయం ఉపాధిని సాధించాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. ఇలా స్వయం ఉపాధిని పొంది మరికొందరికి ఉపాధి అవకాశాన్ని కల్పించిన యజమాని, యువకుడు అయిన అశోక్ కృషిని ఎమ్మెల్యే, కుడా చైర్మన్‌లు అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు, నియోజక వర్గ నాయకులు డా.గౌరకపూడి చిన్నయ్యదొర, తెదేపా నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు వాసు, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, కంటే జగదీశ్ మోహన్, గోలి దొరబాబు, జనసేన నాయకులు సరోజ వాసు, పిట్టా జానకి రామారావు, పెంకే వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# సార్వత్రిక సమ్మెను విజయవంతం చెయ్యండి




**పెద్దాపురం, మే 9 (పెన్ సత్తా):** లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20వ తేదీన జరిగే దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్ పిలుపునిచ్చారు. పెద్దాపురం యాసలపు సూర్యారావు భవనంలో గడిగట్ల సత్తిబాబు అధ్యక్షతన సిఐటియు మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కమిటీ ప్రచురించిన సమ్మె బుక్ లెట్‌ను ఆవిష్కరించారు. దేశ వ్యాప్తంగా కార్మిక వర్గం అనేక కష్టాల్లో ఉందని దాని నుండి కార్మికులను బయట పడేయాల్సిన ప్రభుత్వాలు కార్మిక వర్గాన్ని మరింత కష్టాల్లోకి నెట్టేస్తుందని అన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, కానీ నిజ వేతనాలు పెరగడం లేదన్నారు. మే 20వ తేదీన కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మె జరుగుతుందని దీనిని విజయవంతం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు నాయకులు దాడి బేబి, మాగాపు నాగు, గూనూరు రమణ, తాడిశెట్టి గంగ, డి.క్రాంతి కుమార్‌లు పాల్గొన్నారు.

# కరప మండలంలో వ్యవసాయ యాంత్రీకరణకు ప్రోత్సాహం

## - రైతులకు 37 పవర్ టెల్లర్ ట్రాక్టర్లు అందజేత







**కరప, మే 9 (పెన్ సత్తా):** కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని కరప మండలం, నక్కా సూర్యనారాయణ మూర్తి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన వ్యవసాయ యాంత్రీకరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఏడీఏ బాబురావు, ఏవో రాజేష్ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి, వారికి ఆర్థిక సహాయం అందజేస్తోందని తెలిపారు. వ్యవసాయాన్ని సాంకేతికంగా అభివృద్ధి చేయడానికి యాంత్రీకరణ ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. మొత్తం రూ. 37 లక్షల రాయితీతో ఏర్పాటు చేసిన 37 పవర్ టెల్లర్ ట్రాక్టర్లను రైతులకు ఆయన చేతుల మీదుగా అందజేశారు. జనసేన నాయకులు, కూటమి నాయకులు, అధికారులు, రైతులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కుట్టు శిక్షణలపై విమర్శిస్తే సహించం

## - రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్



**సామర్లకోట, మే 9 (పెన్ సత్తా):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేద మహిళల ఉపాధి కల్పనా పథకం కుట్టు శిక్షణపై విమర్శించే అర్హత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలకు లేదని, దానిని సహించబోమని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్ హెచ్చరించారు. గురువారం సామర్లకోట పట్టణ తెదేపా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీకాంత్ మాట్లాడారు. అవినీతి అక్రమాలకు చిరునామాగా నిలిచిన వైఎస్ ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పార్టీ నేతలు ఒక్కసారి ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప నిరంతరం ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు ఆవాల లక్ష్మీనారాయణ కుట్టు శిక్షణపై విమర్శలు చేయటం సిగ్గుచేటన్నారు. అసత్య ఆరోపణలు చేస్తే చర్యలు తప్పవని ఈ సందర్భంగా శ్రీకాంత్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అందుగుల జార్జి చక్రవర్తి, గోల్తి సత్యనారాయణ, పడాల వీరబాబు, మల్లిరెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హెన్రీ డ్యూనాంట్ జన్మదిన వేడుక



**కాకినాడ, మే 9 (పెన్ సత్తా):** అలయన్స్ క్లబ్ కాకినాడ శరవణ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు, దాతృత్వానికి పరమాన్నంగా నిలిచిన హెన్రీ డ్యూనాంట్ జన్మదిన వేడుకలు రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్, గాంధీనగర్, కాకినాడలో ఘనంగా నిర్వహించారు. హెన్రీ డ్యూనాంట్ ఉమ్మడి మానవతావాదానికి చిరునామాగా నిలిచారు. ప్రపంచ వ్యాప్తంగా సేవాభావాన్ని ప్రేరేపించే మహానుభావునికి అలయన్స్ క్లబ్ సభ్యులు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రెసిడెంట్ అలై. యాళ్ళ రత్నారావు హెన్రీ డ్యూనాంట్ విగ్రహానికి పూలమాలతో అలంకరించారు. క్లబ్ వ్యవస్థాపకులు అలై. దిలీప్ కుమార్ సధనాని, అలై. వై.మురళీధర్, క్లబ్ కోశాధికారి అలై. డామిశెట్టి శ్రీనివాసరావు అలై. ఆర్.రవి శంకర్ పట్నాయక్, అలై. సేతు మాధవరావు, అలై. పోల్ల సాయి బాబా, ఎన్.బాలరామ మూర్తి తదితరులు పుష్పాంజలి అర్పించారు. మహానుభావునికి అలయన్స్ క్లబ్ అఫ్ కాకినాడ శరవణ సభ్యులు ఘన నివాళి అర్పించారు. క్లబ్ ప్రెసిడెంట్ అలై. యాళ్ళ రత్నారావు మాట్లాడుతూ హెన్రీ డ్యూనాంట్ జీవితకథ ప్రతి ఒక్కరినీ మానవ సేవ పట్ల ప్రేరేపించేది. ఒక వ్యక్తి శ్రద్ధ ప్రపంచ వ్యాప్తంగా మార్పుని తీసుకురాగలదని ఆయన నిరూపించారన్నారు. అలై. దిలీప్ కుమార్ సధనాని మాట్లాడుతూ "రెడ్ క్రాస్ యొక్క విలువలు, మానవత్వం, పాక్షికత లేని సేవా దృక్పథం అలయన్స్ క్లబ్ శరవణ లక్ష్యాలకు దగ్గరగా ఉన్నాయన్నారు. అతనికి నివాళి అర్పించడం మన సేవా ప్రతిజ్ఞకు గుర్తింపు అన్నారు. అనంతరం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, కాకినాడ కార్యదర్శి ఎస్.శివకుమార్‌ని క్లబ్ తరపున శాలువాతో ఘనంగా సన్మానించారు. ఎస్.శివకుమార్ అభినందనలందుకొని మాట్లాడుతూ ఈ గౌరవానికి అలయన్స్ అఫ్ క్లబ్ కాకినాడ శరవణకు ధన్యవాదాలు తెలిపారు. మనమందరం కలిసి పనిచేస్తూ మరెందరో జీవితాలను రక్షించగలుగుతాం. ఇది సేవా మార్గంలో మనందరికి ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు.

# కరప పీహెచ్‌సీ అభివృద్ధిలో మరో ముందడుగు

## - రూ.33.49 లక్షలతో నూతన పరీక్షా భవనం నిర్మాణానికి శంకుస్థాపన





**కరప, మే 9 (పెన్ సత్తా):** కరప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధిలో కీలకమైన ముందడుగు పడింది. నేషనల్ హెల్త్ మిషన్ మరియు రాష్ట్ర హెల్త్, మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ నిధుల కింద మంజూరైన రూ. 33,49,944తో నూతన ఆరోగ్య పరీక్షల భవన నిర్మాణానికి గురువారం శంకుస్థాపన జరగింది. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వర రావు (నానాజీ) వేద మంత్రాల మధ్య భూమి పూజ నిర్వహించి, నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్ నిధుల ద్వారా రూ. 46 లక్షల విలువైన అత్యాధునిక వైద్య పరికరాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ ఇటీవలి కాలంలో సాధారణ ప్రజలు ప్రైవేట్ హాస్పిటల్స్‌కు పరీక్షల కోసం వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.


ఇది వారి ఆర్థిక పరిస్థితిపై ప్రభావం చూపుతుంది. ఈ నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లోనే ఆధునిక పరీక్షా సదుపాయాలను అందుబాటులోకి తెస్తోంది అని అన్నారు. ప్రజల ఆరోగ్య సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న ఈ చర్యలు ప్రశంసనీయం అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయానికి మరలుదాం : కే.బాబూరావు



**తాళ్ళరేవు, మే 9 (పెన్ సత్తా):** కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పి.మల్లవరం పంచాయతీ ప్రాంగణంలో జరిగిన రైతు గ్రామ సభలో కరప సబ్ డివిజన్ అసిస్టెంట్ అగ్రికల్చర్ అధికారి కే.బాబూరావు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతీ రైతూ భూమాతను కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, కావునా ప్రతీ ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం వైపు మరలాలని, క్రమేపీ రసాయనాలు, ఎరువులు వాడకాన్ని తగ్గిస్తూ కాషాయాలు, ఘన, ద్రవ జీవామృతంలు అలవాటు చెయ్యాలి అని ఈ విధంగా సుమారు 5 సంవత్సరాలు పాటు చేయగలగితే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు తీయవచ్చు అన్నారు. సర్పంచ్ పంపన రామకృష్ణ మాట్లాడుతూ మల్లవరం పంచాయతీలో రైతులు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమం నిర్వాహకులు కృషి అమృత్ గోవు ఆధారిత ప్రకృతి వ్యవసాయ క్షేత్రం రైతు ధూళిపూడి వెంకి (బాబి) మాట్లాడుతూ గత సంవత్సరం కాలంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు మరికొంత మంది రైతులను ప్రోత్సహించాలని, అందరం సంఘటితంగా ప్రకృతి వ్యవసాయం చేద్దామని, వారికి కావలసిన సూచనలు సలహాలు మరియు కషాయాలు, పిండ్లు (వేప, ఆముదం) అందుబాటులో ఉంచుతామని తెలిపారు, ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం చేసిన రైతులు దడాల సత్తి కొండ, రాయుడు సింహాచలం, అబ్బిరెడ్డి నాగేశ్వరరావు, పేరాబత్తుల భైరవమూర్తి, విళ్ళ సత్యనారాయణ, రాంబాబు, పేరాబత్తుల వెర్రి బాబులను ఘనంగా సన్మానించి, మామిడి మొక్కలు, విత్తనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపిసియన్ఎఫ్ సిబ్బంది యంటి ధనలక్ష్మి, సంధ్య, రమణీ, వెంకటలక్ష్మి, భవానీ, విజయ లక్ష్మి, నేహా, తులసి, అరుణ, శారద, సుధ, చిరంజీవి, వాడపల్లి, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# ప్రత్తిపాడు కోర్టు అసిస్టెంట్‌గా రాజాల చిట్టిబాబు







**అన్నవరం, మే 9 (పెన్ సత్తా):** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు గవర్నమెంట్ ప్లీడర్‌గా, ప్రముఖ న్యాయవాది రాజాల చిట్టిబాబు నియమించబడ్డారు. నిన్న జరిగిన రాష్ట్ర సచివాలయం అమరావతి నందు, లా సెక్రటరీ వద్ద నుండి ఉత్తర్వులు తీసుకోవడం జరిగింది. ఈ పదవిలో మూడు సంవత్సరముల పాటు రెవెన్యూ, పంచాయతీ, ఇతర ప్రభుత్వ కేసులు, ప్రభుత్వం తరపున, ప్రతిపాడు కోర్టులో వాదిస్తారు. రాజాల చిట్టిబాబు అంచెలంచెలుగా పైకి ఎదిగి న్యాయవాదిగా మంచి పేరు సంపాదించుకుని అన్నవరం గ్రామంలో అందరికీ సుపరిచితుడుగా ఉండి గ్రామ ప్రజలకు సేవ చేస్తున్నారు. గ్రామంలో ఉన్న మిగతా లాయర్లు, మల్లేశ్వరరావు, ములుగు నాగేశ్వరరావు, రాయి శ్రీనివాసరావు, శర్మ, మూర్తి, తదితరులు అభినందనలు తెలియజేశారు.


# 13న యుటిఎఫ్ ఆధ్వర్యంలో సూర్యకళా మందిరంలో డి.ఎస్.సి. అవగాహన సదస్సు

**- హాజరు కానున్న పోటీ పరీక్షల శిక్షణా నిపుణులు, పూర్వ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు**

**కాకినాడ, మే 9 (పెన్ సత్తా):** ఈనెల 13వ తేదీ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) కాకినాడ జిల్లా శాఖ ఆధ్వర్యంలో డి.ఎస్.సి. అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ నాయకత్వం తెలిపారు. శుక్రవారం ఉదయం కాకినాడ యుటి ఎఫ్‌లో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.రవి చక్రవర్తి, పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకర వర్మలు మీడియాతో మాట్లాడారు. అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ ఆశయాలుగా కలిగిన యుటిఎఫ్ ఉపాధ్యాయుల శ్రేయస్సు, ప్రభుత్వ విద్యారంగం పరిరక్షణ కోసం కృషి చేస్తూ సామాజిక సేవా, సహాయ కార్యక్రమాలు, విద్యా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తుందన్నారు. దానిలో భాగంగా డి.ఎస్.సి. కొరకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు ఈనెల 13 వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుండి కాకినాడ సూర్యకళా మందిరంలో అవగాహన క్లాసులు ఏర్పాటు చేసామన్నారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షల శిక్షణా నిపుణులు, పూర్వ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మరియు ఆయన బృందం హాజరై వివిధ అంశాలను బోధిస్తారని తెలిపారు. అదేవిధంగా సదస్సుకి హాజరైన వారికి లక్ష్మణరావు సౌజన్యంతో రూపొందించిన "విద్యా మనో విజ్ఞాన శాస్త్రం" స్టడీ మెటీరియల్ ఉచితంగా అందచేస్తామన్నారు. ఈ సందర్భంగా మెటీరియల్ బుక్ ఆవిష్కరించారు. వివరములకు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు టి.రామలక్ష్మి (9959562666), కె.పెద్దిరాజు (9652677889) లను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టి.రవి చక్రవర్తి, జి.ప్రభాకర వర్మలతో పాటు యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కెవివి నగేష్, నాయకులు కె.ఈశ్వరరావు, కాంట్రాక్టు లెక్చరర్ల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.




# కన్నుల పండుగగా శ్రీ అనంతలక్ష్మీ సమేత సత్యనారాయణ స్వామివారి వార్షిక దివ్య కళ్యాణం





**అన్నవరం, మే 9 (పెన్ సత్తా):** కాకినాడ జిల్లా అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి, అనంతలక్ష్మి అమ్మవారి, కళ్యాణం కన్నులు పండుగ నిర్వహించారు. శ్రీ స్వామివారి దివ్య కళ్యాణం పెళ్లి పెద్దలుగా సీతారాముల వారు, వేద పండితులు మంత్రోచ్ఛారణ, మంగళ వాయిద్యాలు నడుమ గ్రామ పురవీధుల్లో గ్రామసేవ నిర్వహించి కొండపై సర్వాంగ సుందరంగా అలంకరించిన శ్రీ స్వామివారి వార్షిక కళ్యాణ వేదికపై, వెండి సింహాసనంపై, వధూవరులు, శ్రీ సత్యదేవుడు అనంతలక్ష్మి అమ్మవారు ఆశీనులుగావించి, పెళ్లి పెద్దలు సీతారాములవారిని ఆశీనులు గావించి, పెళ్లి తంతు కార్యక్రమం ప్రారంభించారు. ఆలయ చైర్మన్ దంపతులు, ఈవో దంపతులు, శ్రీ స్వామి అమ్మవార్లకు, నూతన పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. అనంతరం వేద పండితులు, ఆలయ ప్రధాన అర్చకులు, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, గౌరీ పూజ నిర్వహించారు. 10 గంటల 45 నిమిషములకు జీలకర్ర బెల్లం పెట్టించారు. తదనంతరం మాంగల్య ధారణ కావించారు, సర్వాంగ సుందరంగా అలంకరించి పెద్ద పెద్ద స్క్రీన్లతో భక్తులు తిలకించేటట్టు సౌకర్యాలు నిర్వహించారు. వివాహ అనంతరం, భక్తులకు తలంబ్రాలు, ముత్యంతో కూడిన పేకెట్లు, భంగీప్రసాదం వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ యనమల దివ్య, ప్రత్తిపాడు శాసనసభ్యులు వరుపుల సత్యప్రభ, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు.

పెద్దాపురం డిఎస్పి శ్రీ హరి రాజు, ప్రత్తిపాడు సిఐ ఎస్ అప్పారావు ఆధ్వర్యంలో 2000 మంది సిబ్బందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా, దేవస్థానం అధికారులు తగు చర్యలు గైకొన్నారు.



# అరుణ హాస్పిటల్ అధినేత చవ్వాకుల శేషగిరిరావు తనయుడు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన గ్రామీణ వైద్యులు

**కాకినాడ, మే 9 (పెన్ సత్తా):** అరుణ హాస్పిటల్ అధినేత డాక్టర్ చవ్వా కుల శేషగిరిరావు, హిమబిందు తనయుడు పుట్టినరోజు శుభా కాంక్షలు తెలిపిన ప్రముఖులు వైద్యులు హాస్పటల్ స్టాఫ్ మరియు గ్రామీణ వైద్య నాయకులు అధిక సంఖ్యలో చవ్వాకుల అభిరామ్‌కి అడ్వాన్స్ పుట్టినరోజు శుభాకాంక్షలు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలపటం జరిగింది. కె ఎస్ ఎన్ బాబు, కె ఎస్ ఆచార్యులు కే శివప్రసాద్, కొమ్మన తాతారావు, జెవివి సూర్యనారాయణ మూర్తి, సిహెచ్ ఏడుకొండలు, కే శ్రీనివాసరావు, ఎన్ శ్రీనివాసరావు, ఎస్.వి.రామారావు, సత్యానందం, చిట్టి కొండ, ఎన్ఎస్ ప్రకాష్, తదితర నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

# గాలి జనార్ధన్ రెడ్డిపై అనర్హత వేటు




**కర్ణాటక:** కర్ణాటకకు చెందిన కల్యాణ రాజ్య ప్రగతి పక్ష శాసన సభ్యుడు, మాజీ మంత్రి గాలి జనార్ధన్ రెడ్డికి మరో బిగ్ షాక్ తగిలింది. ఓబుళాపురం మైనింగ్ అక్రమ తవ్వకాల వ్యవహారంలో ఏడు సంవత్సరాల కారాగార శిక్ష పడిన ఆయనపై కర్ణాటక అసెంబ్లీ సంచలన నిర్ణయాన్ని తీసుకుంది, గాలిపై అనర్హత వేటు వేసింది. ఈ మేరకు ఓ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఓబుళాపురం గనుల్లో అక్రమ తవ్వకాల వ్యవహారంలో హైదరాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం గాలి జనార్ధన్ రెడ్డికి ఏడు సంవత్సరాల కారాగార శిక్ష విధించిన విషయం తెలిసిందే. ఇదే కేసును ఎదుర్కొన్న తెలంగాణకు చెందిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఏపీకి చెందిన సీనియర్ ఐఎఎస్ అధికారిణి వై శ్రీలక్ష్మిని నిర్దోషులుగా తేల్చింది. వారిపై సీబీఐ నమోదు చేసిన కేసులను కోర్టు కొట్టివేసింది. ఇదే కేసులో గాలి జనార్ధన్ రెడ్డి దోషిగా తేల్చి ఏడేళ్ల జైలు శిక్షను విధించింది సీబీఐ స్పెషల్ కోర్టు. అదే ఇప్పుడు ఆయనకు రాజకీయంగా కూడా చిక్కులను తెచ్చిపెట్టింది. క్రియాశీలక రాజకీయాలకు శాశ్వతంగా దూరం అయ్యేలా చేసినట్టయింది. కర్ణాటక అసెంబ్లీ ఆయనపై అనర్హత వేటు వేసింది. ఈ మేరకు అసెంబ్లీ కార్యదర్శి ఎంకె విశాలాక్షి నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రస్తుతం గాలి జనార్ధన్ రెడ్డి కొప్పళ జిల్లాలోని గంగావతి అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిథ్యాన్ని వహిస్తున్నారు. 2023 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తన సొంత పార్టీ కల్యాణ రాజ్య ప్రగతి పక్ష తరపున పోటీ చేశారు. దాదాపు 8,000 ఓట్ల మెజారిటీతో తన సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్‌కు చెందిన ఇక్బాల్ అన్సారీని ఓడించారు. 2022లో కేఆర్పీపీ పార్టీని స్థాపించారు గాలి. ఆ తరువాత దీన్ని భారతీయ జనతా పార్టీలో విలీనం చేశారు. మైనింగ్ కుంభకోణంలో జైలు శిక్ష అనుభవించడానికి ముందు ఆయన యడియూరప్ప ప్రభుత్వంలో కర్ణాటక పర్యాటక శాఖ మంత్రిగా పని చేశారు. 2015 నుండి బెయిల్‌పై ఉన్న ఆయన బీజేపీకి దూరంగా ఉంటూ వచ్చారు. సొంత పార్టీని నెలకొల్పారు. గంగావతి నియోజకవర్గ ఎమ్మెల్యే జి.జనార్ధన రెడ్డిని దోషిగా నిర్ధారించిన తర్వాత ఆయన రాష్ట్ర శాసనసభ నుండి అనర్హుడిగా ప్రకటించారు. అనర్హత ఈ నెల 6వ తేదీ నుండి అమల్లోకి వచ్చింది. అక్రమ మైనింగ్ కేసులో గాలి జనార్ధన్ రెడ్డిని సీబీఐ కోర్టు దోషిగా తేల్చిన నేపథ్యంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 191 (1) (ఈ), 1951 ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 8 ఆధారంగా ఆయనపై ఆరు సంవత్సరాల పాటు అనర్హత వేటు వేసినట్లు నోటిఫికేషన్ పేర్కొంది. ఫలితంగా– గంగావతి అసెంబ్లీ స్థానం ఖాళీ అయింది.

# మహబూబాబాద్ పట్టణంలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలి

**- ఎమ్మెల్యే మురళీనాయక్‌కు టియుడబ్ల్యూజే (ఐజేయు) వినతి**

**ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల బ్యూరో, మే 9 (పెన్ సత్తా):** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇంటిస్థలాలు అందజేయాలని టియుడబ్ల్యూజే (ఐజేయు) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళినాయక్‌ను కోరారు. మహబూబా బాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా ప్రధాన కార్యదర్శి గాడిపల్లి శ్రీహరి, సీనియర్ జర్నలిస్ట్ ప్రసాద్‌లతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళినాయక్‌కు వినతిపత్రం అందజే శారు. ఈ సందర్భంగా సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న 58మంది జర్నలిస్ట్‌లకు ఇంటి స్థలాలు ఇవ్వడం జరిగిందని, వారందరికీ ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేయాలని కోరారు. ఇంకా సుమారుగా ఎనభైమంది వరకు వర్కింగ్ జర్నలిస్టులు ప్రస్తుతం మహబూబాబాద్ కేంద్రంగా పనిచేస్తున్నారని, వారందరికీ ఇంటిస్థలాలు ఇప్పించాలని, ప్రజాప్రభుత్వంలో పాత్రికేయులందరికీ న్యాయం చేయాలని కోరారు. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో జర్నలిస్ట్‌లు కూడా వారి, వారి నివాస గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లకోసం దరఖాస్తులు చేసుకున్నారని, ఆయా గ్రామాలలో ఇందిరమ్మ కమిటీలకు సూచన చేసి అర్హులైన జర్నలిస్ట్‌లందరికీ మొదటి జాబితాలోనే ఇండ్లు వచ్చే విధంగా సహకరించాలని సిహెచ్ శ్రీనివాస్ అభ్యర్థించారు. టియుడబ్ల్యూజే (ఐజేయు) విజ్ఞప్తిపై ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళినాయక్ సానుకూలంగా స్పందించారు. మహబూబాబాద్ నియోజకవర్గ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ళు కోసం దరఖాస్తు చేసుకుని, అర్హత కలిగి ఉంటే ఖచ్చితంగా ప్రదమప్రాదాన్యత జర్నలిస్ట్‌లకు ఇస్తానని మాట ఇచ్చారు. మహబూబాబాద్ పట్టణంలో జర్నలిస్ట్‌ల ఇంటిస్థలాల అంశాన్ని కూడా ప్రత్యేక దృష్టితో పరిశీలిస్తానని, జాబితాపై చర్చించి, జిల్లా అధికా రులతో మాట్లాడి ఖచ్చితంగా న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.



# ప్రాణం తీసిన ఈత సరదా



**కోదాడ, మే 9 (పెన్ సత్తా):** బావిలో ఈతకి వెళ్లిన ఇద్దరు యువకులు నీటిలో మునిగి మృతి చెందిన సంఘటన హుజుర్ నగర్ పట్టణంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. ఉమ్మడి నల్గొండ జిల్లాకి చెందిన 8 మంది గొర్ల కాపరులు గొర్లు మేత కోసం హుజుర్ నగర్ ప్రాంతానికి వచ్చారని తెలిపారు.

మక్తల్ మండలం గుడిమండ్ల గ్రామానికి చెందిన కనుమనూర్ శేఖర్ (14) తో పాటు చందాపురం గ్రామానికి చెందిన మొదీపురం లక్ష్మణ్ (21) శుక్రవారం ఉదయం హుజుర్ నగర్ పట్టణంలోని ఒక వ్యవసాయ బావిలో వచ్చీరాని ఈతతో బావిలోకి దిగి దారి దొరకక ఒకర్ని ఒకరు పట్టుకొని ఊపిరాడక మరణించారు.

# శ్రీకాంత్ 'ఆచార్య'.. ఆ కథేంటి?



ఆచార్య అనగానే చిరంజీవి, రామ్ చరణ్ కాంబినేషన్‌లో వచ్చిన డిజాస్టర్ మూవీనే గుర్తుకు వస్తుంది. కొరటాల శివ డైరెక్ట్ చేసిన ఈ యాక్షన్ డ్రామా భారీ అంచనాల నడుమ 2022లో విడుదలై ఘోరమైన విమర్శలను మూటగట్టుకుంది. బడ్జెట్ లో కనీసం సగం వసూళ్లను కూడా రాబట్టలేకపోయింది. ఈ మెగా ఆచార్య గురించి పక్కన పెడితే.. గతంలో శ్రీకాంత్ హీరోగా ఒక ఆచార్య పట్టాలెక్కిందన్న విషయం మీకు తెలుసా? 2013లో జరిగిన సంగతిది.. రక్ష సినిమా ఫేమ్ వంశీకృష్ణ ఆకెళ్ల దర్శకత్వంలో శ్రీకాంత్ హీరోగా ఆచార్య పేరుతో ఓ సినిమా ప్రకటించబడింది. లేపాక్షి బ్యానర్‌పై గురురాజ్ ఈ సినిమాను నిర్మించేందుకు ముందుకు వచ్చారు. సినిమాను అనౌన్స్ చేయడమే కాదు.. ఓపెనింగ్ కార్యక్రమాన్ని కూడా ఘనంగా నిర్వహించారు. లాంచింగ్ ఈవెంట్‌లో శ్రీకాంత్‌పై క్లాప్ కొట్టారు సునీల్. హైదరాబాద్‌లోనే ఆచార్య సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. లవ్ స్టోరీ నేపథ్యంలో ఈ సినిమాను తెరకెక్కించాలని ప్లాన్ చేశారు. అందుకు తగ్గట్లే వార్నింగ్: లవ్ ఈజ్ ఇంజూరియస్ టు యూత్ అనే ఇంట్రెస్టింగ్ ట్యాగ్ లైన్‌ను సినిమాకు పెట్టారు. అయితే ఏమైందో ఏమో గానీ.. ఫస్ట్ షెడ్యూల్ ముగిశాక ఆచార్య ఆగిపోయింది.

ఆ తర్వాత ఎవరూ ఈ మూవీని రిస్టార్ట్ చేసే ప్రయత్నం చేయలేదు సరికదా దాని వొంక కూడా చూడలేదు. ఆర్థిక ఇబ్బందుల వల్లనో లేక మరే ఇతర కారణం వల్లనో శ్రీకాంత్ ఆచార్య ఆరంభంలోని అటకెక్కింది.కాగా, హీరోగా ఫేడౌట్ అయ్యాక శ్రీకాంత్ సహాయక నటుడిగా మారిన సంగతి తెలిసిందే. సౌత్ భాషా చిత్రాల్లో బలమైన క్యారెక్టర్ రోల్స్ పోషించడమే కాకుండా అవకాశం వచ్చినప్పుడల్లా ప్రతినాయకుడిగానూ శ్రీకాంత్ అలరిస్తున్నారు. మరోవైపు ట్రెండ్ ను ఫాలో అవుతూ వెబ్ సిరీస్‌లలో కూడా యాక్ట్ చేస్తున్నారు. ఈ ఏడాది తెలుగులో గేమ్ ఛేంజర్, అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి వంటి చిత్రాల్లో శ్రీకాంత్ కనిపించారు.

# రజినీ రికార్డు బ్రేకింగ్ రెమ్యూనరేషన్.. నిజమెంత?



కోలీవుడ్ సూపర్‌స్టార్ రజినీకాంత్ ఏడు పదుల వయసులో కూడా వరుసపెట్టి సినిమాలు చేస్తూ ఫుల్ జోష్‌లో ఉన్నారు. ప్రస్తుతం రజనీకాంత్ హీరోగా కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో కూలీ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలున్నాయి. కూలీ సినిమా ఆగస్ట్ 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. కూలీ తర్వాత రజినీకాంత్ నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో జైలర్ కు సీక్వెల్ గా జైలర్2 చేస్తున్న సంగతి తెలిసిందే. అప్పటివరకు వరుస ఫ్లాపులతో ఉన్న రజినీకాంత్‌కు జైలర్ సినిమా ఇచ్చి బూస్టప్ అంతా ఇంతా కాదు. నెల్సన్ దర్శకత్వంలో వచ్చిన ఈ మూవీ ఎంత పెద్ద హిట్టైందో తెలిసిందే. రజినీ కెరీర్లోనే బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్‌గా నిలిచిన ఈ సినిమా రూ. 600 కోట్లకు పైగా కలెక్ట్ చేసింది. ఆ సినిమాలో రజినీ స్టైలిష్ యాక్టింగ్, మోహన్ లాల్, శివరాజ్ కుమార్ క్యామియో, అనిరుధ్ మ్యూజిక్ జైలర్ ను నెక్ట్స్ లెవెల్ కు తీసుకెళ్లాయి. అలాంటి జైలర్ కు సీక్వెల్ గా జైలర్2 కు తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. జైలర్2 ను ఈసారి డైరెక్టర్ నెల్సన్ జైలర్ కు మించేలా మరింత భారీ గా ప్లాన్ చేస్తున్నాడట. కళానిధి మారన్ సన్ పిక్చర్స్ బ్యానర్‌లో భారీ బడ్జెట్‌తో జైలర్2 ను నిర్మిస్తున్నాడు. జైలర్2 కు రజినీకాంత్ తీసుకోబోయే రెమ్యూనరేషన్ గురించి ప్రస్తుతం నెట్టింట ఓ ఇంట్రెస్టింగ్ న్యూస్ హల్‌చల్ చేస్తోంది. జైలర్2 కోసం రజినీ ఏకంగా రూ.260 కోట్లు తీసుకుంటున్నట్టు రూమర్లు వినిపిస్తున్నాయి. ఈ వార్త నిజమైతే కోలీవుడ్‌లోనే కాకుండా భారతదేశంలోనే ఎక్కువ రెమ్యూనరేషన్ తీసుకుంటున్న హీరోగా రజినీ రికార్డుకెక్కుతాడు. జైలర్2 కు అనిరుధ్ సంగీతం అందిస్తుండగా, శివరాజ్ కుమార్, మోహన్ లాల్‌తో పాటూ మరికొందరు స్టార్లు కూడా గెస్ట్ రోల్స్ చేసే అవకాశముంది. అనౌన్స్‌మెంట్ వీడియోతోనే రికార్డులు సృష్టించిన జైలర్2 వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.

# అర్ధంతరంగా నిలిచె...ఐపీఎల్‌పై నీలినీడలు

## - ఉద్రిక్తతల నేపథ్యంలో పంజాబ్-ఢిల్లీ మ్యాచ్ రద్దు - 10.1 ఓవర్లపాటు సాగిన ఆట

**ధర్మశాల:** ఐపీఎల్ చరిత్రలోనే ఎన్నడూ చూడని అరుదైన ఘటన ఇది. భారత్-పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో, పంజాబ్ కింగ్స్-ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మ్యాచ్ భద్రతా కారణాల రీత్యా మధ్యలోనే ఆగింది. గురువారం రాత్రి జమ్మూ, పఠాన్‌కోట్‌లపై పాక్ దాడులకు తెగబడింది. దీంతో ముందు జాగ్రత్తగా ధర్మశాలలో బ్లాక్‌అవుట్ ప్రకటించగా, ఇక్కడే జరుగుతున్న మ్యాచ్‌ను కూడా అర్ధంతరంగా రద్దు చేశారు. వాస్తవానికి పంజాబ్ ఇన్నింగ్స్ 10.1 ఓవర్లపాటు సజావుగానే సాగింది. ఆ తర్వాత ఒక్కసారిగా స్టేడియంలోని ఓ ఫ్లడ్‌లైట్ ఆఫ్ అయ్యింది. మొదట ఏదైనా సమస్య వచ్చిందేమోనని అంతా భావించారు. కానీ కాసేపటికే మరో రెండు ఫ్లడ్‌లైట్లను ఆపేయడంతో స్టేడియంలో చీకటి నెలకొంది. అప్పటికే ఆటగాళ్లతో పాటు అంపైర్లు కూడా మైదానం వీడారు.




అలాగే స్టేడియంలోని ప్రేక్షకులను కూడా బయటికి వెళ్లాల్సిందిగా అధికారులు కోరారు. ఈ క్రమంలో ఎలాంటి తొక్కిసలాట జరగకుండా స్థానిక పోలీసులు, ఆర్మీ సిబ్బంది పర్యవేక్షించారు. మరోవైపు పటిష్ట భద్రత మధ్య ఇరు జట్ల ఆటగాళ్లను స్టేడియం నుంచి హోటళ్లకు తరలించారు. ఈ మ్యాచ్ ఆగే సమయానికి పంజాబ్ 10.1 ఓవర్లలో 122/1 స్కోరుతో ఉంది. ప్రియాన్ష్ ఆర్య (34 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్సర్లతో 70), ప్రభ్‌సిమ్రన్ (28 బంతుల్లో 7 ఫోర్లతో 50 నాటౌట్) అర్ధసెంచరీలు సాధించారు.

ఓపెనర్ల జోరు: వర్షం కారణంగా ఈ మ్యాచ్ గంట ఆలస్యంగా ఆరంభమైంది. అయితే టాస్ గెలిచిన పంజాబ్ బ్యాటింగ్‌కే మొగ్గు చూపింది. కెప్టెన్ శ్రేయాస్ నిర్ణయాన్ని ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్, ప్రియాన్ష్ ఆర్య వమ్ము చేయలేదు. డీసీ బౌలర్లను చెడుగుడు ఆడేస్తూ పరుగుల వరద పారించారు. ఆర్య ఇన్నింగ్స్ తొలి రెండు బంతులను ఫోర్లుగా మలచగా.. అటు ప్రభ్ మూడో ఓవర్‌లో మూడు ఫోర్లు రాబట్టాడు. ఇక చమీర ఓవర్‌లో ఆర్య మరింతగా చెలరేగడంతో 6,4,4తో 18 రన్స్ సమకూరాయి. అయితే ఆరో ఓవర్‌లో పేసర్ నటరాజన్ కేవలం నాలుగు పరుగులే ఇచ్చినా అప్పటికే పవర్‌ప్లేలో 69 స్కోరుతో పటిష్టంగా నిలిచింది. ఆ తర్వాత ఆర్య ఓ సిక్సర్‌తో 25 బంతుల్లోనే తన అర్ధసెంచరీని పూర్తి చేశాడు. కుల్దీపను కూడా వదలకుండా తను పదో ఓవర్‌లో రెండు సిక్సర్లు బాదగా.. ప్రభ్ ఓ ఫోర్‌తో వరుసగా నాలుగో ఫిఫ్టీని పూర్తి చేసుకున్నాడు. పదో ఓవర్‌లోనే స్కోరు 122కి చేరిన వేళ.. పేసర్ నటరాజన్ ఈ ప్రమాదకర జోడీని విడదీశాడు. 11వ ఓవర్‌తో తొలి బంతికే ఆర్యను అవుట్ చేశాడు. ఆ వెంటనే శ్రేయాస్ క్రీజులోకి రావడం.. ఫ్లడ్‌లైట్లను ఆపివేయడం జరిగింది. కాసేపటికే అంపైర్లు, ఆటగాళ్లు మైదానం వీడారు.

# సైనికుల సేవలకు ధన్యవాదాలు జై జవాన్ కోహ్లీ



**ముంబై:** ఇలాంటి క్లిష్ట సమయాల్లో మన దేశాన్ని రక్షిస్తున్న భారత సాయుధ దళాలకు స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ కృతజ్ఞతలు తెలిపారు. మన హీరోల ధైర్యసాహసాలకు మనం ఎప్పటికీ రుణపడి ఉంటామని, దేశం కోసం వారు, వారి కుటుంబాలు చేసిన త్యాగాలను మరువ లేమని సోషల్ మీడియా ఇన్ స్టా వేదికగా వెల్లడించారు. ప్రస్తుతం భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య యుద్ధ పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో వరుసగా రెండో రోజు రెండు దేశాల మధ్య ఉద్రిక్తత నెలకొంది. భారత సరిహద్దు రాష్ట్రాలైన జమ్మూ కశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్?ల పై పాకిస్తాన్ దాడులు చేసింది. ఈ ఘటనలో అనేక మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. దీనికి ఘాటుగా స్పందించిన భారత్ ఈ దాడులకు తగిన సమాధానం (ఆపరేషన్ సిందూర్) ఇచ్చింది. పాకిస్తాన్ కుట్రలను భగ్నం చేసింది. ఇది మాత్రమే కాదు, లాహోర్, కరాచీ, రావల్పిండిలలోని హెక్యూ -9 వైమానిక రక్షణ వ్యవస్థను భారత సైన్యం ధ్వంసం చేసింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఐపీఎల్ ఆటలను బీసీసీఐ నిరవధికంగా వాయిదా వేసింది. ఈ క్రమంలో భారత సైన్యం సేవల గురించి భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. భారత సైన్యం స్ఫూర్తి కారణంగా, దేశ పౌరులు సురక్షితంగా ఉన్నారని సైన్యం సేవలను ప్రశంసించారు. ఇలాంటి సమయంలో దేశాన్ని కాపాడుతున్న మన సైన్యానికి సెల్యూట్ చేయాలన్నారు. సైన్యం ధైర్యసాహసాలకు మనం ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని, సైన్యం త్యాగానికి వారి కుటుంబాలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు కోహ్లీ ఇన్‌స్టాగ్రామ్ ఓ స్టోరీలో పోస్ట్ చేశాడు. కోహ్లీ ఈ పోస్ట్ చేసిన గంటలోనే 34 లక్షల మంది లైక్ చేస్తూ ఈ పోస్టును షేర్ చేయడం విశేషం. దీంతోపాటు అనేక మంది జై హింద్ అంటూ పలు రకాల కామెంట్లు చేస్తూ సైన్యానికి మద్దతుగా అభిప్రాయాలను తెలియజేస్తున్నారు. మరోవైపు మనల్ని హీరోలలా రక్షించిన భారత సాయుధ దళాలకు మేము ఎప్పటికీ కృతజ్ఞులం. వారి త్యాగాలకు, వారికి, వారి కుటుంబాలకు హృదయపూర్వక కృతజ్ఞతలు అని కోహ్లీ భార్య అనుష్క శర్మ కూడా ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ చేశారు. ఐపీఎల్ రద్దు తర్వాత ఆటగాళ్లందరూ తమ ఇళ్లకు తిరిగి వెళ్తున్నారు. విరాట్ కోహ్లీ ఉన్నాడు. ఈ క్రమంలో టోర్నమెంట్‌లో పాల్గొనే విదేశీ ఆటగాళ్లందరినీ వారి ఇళ్లకు పంపడానికి కూడా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

"PEN SATTA" Telugu Daily Printed, Published & Owned by : **CHINTAMANENI ANIL KUMAR,** D.No.1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRA PRADESH-531021, Published at D.No.1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRA PRADESH-531021. and Printed at Chaitanya Varadhi Printers, D.No. 2-99, Bharanikam, Parawada, VISAKHAPATNAM-531021, Editor : **CHINTAMANENI ANIL KUMAR,** D.No.1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRA PRADESH-531021, Cell : 98853 15759, RNI No.APTEL/2023/87729, Email : anilchintamaneni@gmail.com